ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వార్తలు

బుధవారం 29 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 23.0



నరసాపురం, మొగల్తూరు తీరంలో గాలుల ఉధృతి


పెనుమంట్ర మండలంలో కూలిన చెట్లు


తాడేపల్లిగూడెం మండలంలో నేలనంటిన వరి


కలపర్రు జాతీయ రహదారిపై వాహనాలు నిలిపిన పోలీసులు


యలమంచిలి మండలంలో విరిగిపడిన చెట్టు


పేరుపాలెం వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

అల కల్లోలం

భారీ వర్షాలు.. విరుచుకుపడిన గాలులు

మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తీవ్రమైన ఈదురుగాలులు, భారీ వర్షాలతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. తీర ప్రాంతంలో కడలి ఉవ్వెత్తున ఎగసిపడడంతో అల్లకల్లోలంగా మారింది. సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చింది. గాలుల తీవ్రతకు వరి చేలు నేలనంటాయి. మినుము పంట దెబ్బ తింది. ఆక్వా రైతులకు ఊపిరాడలేదు. భారీ చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల రోజంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు బస్సు సర్వీసులు రద్దు చేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19, ఏలూరు జిల్లాలో 54 తుఫాను పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. ముందస్తు సహాయక చర్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రత్యేకాధికారులు, కలెక్టర్లు సమీక్షించారు. తీర ప్రాంతం, కొల్లేరులో క్షేత్రస్థాయిలో పర్యటించి సహాయక చర్యలు అడిగి తెలుసుకున్నారు.

- నరసాపురం, మొగల్తూరుకు తీవ్ర నష్టం..
- పలు గ్రామాలను ఖాళీ చేయించిన అధికారులు
- వంద మీటర్లు ముందుకొచ్చిన సముద్రం
- 100 కిలోమీటర్ల వేగంతో గాలులు
- భయంతో బిక్కుబిక్కుమంటున్న తీర గ్రామాల ప్రజలు
- పునరావాస కేంద్రాలకు వేల మంది తరలింపు
- పీఎం లంకలో చెట్టుకొమ్మ పడి వృద్ధురాలి మృతి
- పలు చోట్ల నేలకొరిగిన భారీ వృక్షాలు
- ట్రాఫిక్, విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం/రూరల్/మొగల్తూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ అల్లకల్లోలం సృష్టించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రాత్రి పొద్దుపోయే వరకు ఈదురు గాలులు, వర్షాలు, సముద్రహోరుకు ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. కడలి కల్లోలంగా మారింది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పేరుపాలెం, కేపీ పాలెం, పీఎం లంక వద్ద 100 మీటర్ల మేర కడలి ముందుకు చొచ్చుకొచ్చింది. అలలు ఎగసి పడుతున్నాయి. ఉద యం నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. ఈదురు గాలుల బీభత్సానికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. కొబ్బరి, తాడి, సరుగుడు, మామిడి చెట్లు విరిగిపడ్డాయి. నరసాపురంలో వందేళ్ల నాటి భారీ వృక్షాలు కూకటివేళ్లతో సహా నేలకొరిగాయి. విద్యుత్ వైర్లు తెగి, స్తంభాలు నేలకొరి గాయి. ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పీఎం లంకలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. నరసాపురం-సీతారాంపురం, ధర్బరేవు, వేములదీవి గ్రామాల్లో చెట్లు రోడ్డుపై పడడం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. గాలులకు, వర్షాలకు ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. చినలంక నుంచి మోళ్లపర్రు వరకు ఉన్న 19 కిలోమీటర్ల సముద్ర తీరాన్ని మూసివేశారు. సోమవారంతో పోలిస్తే మంగళవారం 100 మీటర్ల వద్ద ముందుకు చొచ్చుకొచ్చింది. పీఎం లంక వద్ద చాలాచోట్ల గట్టు కోతకు గురైంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. పేరుపాలెం వద్ద ఇదే పరిస్థితి. ఎన్డీఆర్ ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, మైరెన్, పోలీసులు గస్తీ నిర్వహించారు.

వేల మంది పునరావాస కేంద్రాలకు..

గాలలు, సముద్రం హోరుకు భయపడిన తీరప్రాంత వాసులు పునరావస కేంద్రాలకు తరలివచ్చారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 19 కేంద్రాలకు వారిని తరలించారు. అత్యధికంగా పీఎంలంక క్రేందంలో 2వేల మంది పునరావాసం పొందారు. కేపీపాలెం ఉన్నత పాఠశాల, మెట్రేవు, బీకే మెరక, మోళ్లపర్రు, పేరుపాలెం ఉన్నత పాఠశాల, లైన్ పల్లవపాలెం, పాతపాడు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి మత్స్యకారులతోపాటు, తుఫాన్ ప్రభావిత గ్రామాల ప్రజలను తరలించారు. ఒక్కసారిగా గ్రామస్థులు రావడంతో చాలాచోట్ల భోజనాలకు ఇబ్బందులు ఏర్పడినా అప్పటికప్పుడు వండి వడ్డించారు. అన్ని కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, జనరేటర్లు ఏర్పాటు చేశారు.

ఉప్పుటేరుల్లో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. దర్బరేవు, గొంతేరు, బొంతేరు, వెస్ట్ కుక్కులేరు, ఈస్ట్ కుక్కులేరు, మాగలేరు డ్రెయిన్ బిగిసి ఉండడంతో నీరు పారక వరి చేలు, ఆక్వా చెరువులోకి ప్రవహించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా కలెక్టర్ నాగరాణి ఏర్పాట్లు చేశారు. పునరావాస కేంద్రాలను ఎస్పీ నయీం అస్మీ, ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్లు, అధికారులు పరిశీలించారు. నరసాపురం నియోజకవర్గంలో 16 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

మొంథా ముప్పు

ఈదురు గాలులు.. భారీ వర్షాలు

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కూకటి వేళ్లతో నేలకొరిగిన చెట్లు
- ఒరిగిన విద్యుత్ స్తంభాలు..
- వరి, అరటి తోటలు ధ్వంసం

(భీమవరం/ఏలూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

పశ్చిమ గోదావరి జిల్లాపై మొంథా తుఫాను ప్రభావం తీవ్రంగానే ఉంది. బలమైన ఈదురుగాలులతో జిల్లాలోని పలు మండలాలు వణికిపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో గ్రామాలు, పట్టణాల్లో అంధకారం అలుముకుంది. వర్షాలు, ఈదురుగాలులకు 3,800 ఎకరాల్లో వరి నేల మట్టమైంది. పాలు పోసుకునే దశలో వరికి మొంథా ఉరి వేసినంత పనిచేసింది. ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కూరగాయల పంటలు దెబ్బ తిన్నాయి. రాష్ట్ర రహదారులపై చెట్లు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వృక్షాలు కూకటివేళ్లతో నేలమట్టమయ్యాయి. తుఫాను సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం తలమునకలైంది. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి. మొగల్తూరు, కాళ్ల, భీమవరం రూరల్, ఆకివీడు, పాలకొల్లు రూరల్ తదితర మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

సహాయక చర్యలు ముమ్మరం

తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోడానికి మూడు రోజుల ముందు నుంచే అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో సహాయక చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయి. విరిగిన చెట్లను తొలగించి రాకపోకలను పునరిద్ధరిస్తున్నారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్నారు.

ఏలూరులో 1506 హెక్టార్లకు నష్టం

ఏలూరు జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దెందులూరు మండలంలో చెట్లు నేలకూలాయి. జిల్లాలో 1506 హెక్టార్లలో వరి, మినుము పంటకు నష్టం వాటిల్లింది. 17 మండలాల్లోని 84 గ్రామాల్లో 2020 మంది రైతులకు చెందిన వరి, మినుము పంట దెబ్బతింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలోనే అత్యధికంగా పెదపాడులో 23.6 మి.మీ వర్షపాతం నమోదైంది. కైకలూరు మండలంలో కొల్లేరు వరద ఉధృతి పెరిగింది. కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయం వద్ద ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 1300 క్యూసెక్కులు నీరు చేరుతుండగా దిగువకు 3500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కలెక్టర్, ప్రత్యేకాధికారి సమీక్ష

తుఫాను పునరావాస కేంద్రాలలో బాధితులకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి మంగళవారం నియోజకవర్గ మండల ప్రత్యేకాధికారులు, జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తుఫాన్ సహాయక చర్యలపై జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లా అధికారులతో శాఖల వారీగా సమీక్ష చేశారు. జిల్లాలో ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామ సచివాలయ స్థాయిలో సిబ్బంది అప్రమత్తత సూచనలు ఇవ్వాలని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జేసీ అభిషేక్ గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.


మొగల్తూరు తీరంలో పునరావాస కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మీ, అధికారులు

ఏలూరు జిల్లాలో 54 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 1937 మందిని తరలించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రతి పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. జిల్లాలో 148 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 318 మంది గర్భిణులను దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించినట్లు ఆయన వివరించారు.

75 వేల ఎకరాలకే పంటల బీమా!

భీమవరం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):సార్వా సాగుకు తుఫాను దెబ్బ తప్పలేదు. మంగళవారం సాయంత్రం భారీ గాలులకు చాలాచోట్ల వరి చేలు నేలకొరిగాయి. ఎకరాకు రూ.200 చెల్లిస్తే రూ.40 వేలు బీమా వర్తించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించినా రైతులు పంటల బీమా చెల్లింపులో అలసత్వం శాపంగా మారనుంది.

ఏం భయం లేదు.. మేమున్నాం : మంత్రుల హామీ


పెద్ద ఎడ్లగాడి వద్ద కొల్లేరు ఉధృతిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లేరులో గుర్రపు డెక్కను తొలగిస్తాం : నాదెండ్ల

కైకలూరు, మండవల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ఉధృతిని మంగళవారం ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. పూరి గుడిసెలు, రేకుల షెడ్ల వద్దకు వెళ్లి ప్రజలను తక్షణమే ఖాళీ చేసి ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. రేకులషెడ్డులో పశువులను కట్టివేసి ఉండడంతో 100 కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తే రేకులు ఉండవని, పశువులను వేరే ప్రాంతానికి తరలించవలసి ఉన్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వృద్ధులతో, మత్స్యకారులతో మాట్లాడారు. కొల్లేరు సరస్సులో నీటి ప్రవాహానికి అవరోధాలు లేకుండా చర్యలు చేపడతామని, పెద్దఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి

నూజివీడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):తుఫాను సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా పనిచేయాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పునరావాస కేంద్రాల్లో నాణ్యమైన భోజనం, వసతి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ బొల్లపల్లి వినూత్న, డీఎస్పీ కేవీ.ప్రసాద్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.


బియ్యపుతిప్పలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

అండగా మేమున్నాం : మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్‌పై ప్రజలంతా ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలులో ఆయన మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తన కార్యాలయంలోని 9848166644, 9550365446, 8886519418 9440407096 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నష్టం జరిగితే సర్వే చేయిస్తాం : మంత్రి నిమ్మల

తుఫాన్ కారణంగా నష్టం సంభవిస్తే వెంటనే సర్వే చేయించి ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు మంగళవారం రాత్రి ఆయన బియ్యపుతిప్పలో పర్యటించి పునరావాస కేంద్రాలను సందర్శించారు. మీడియాతో మాట్లాడుతూ అంధకారం ఏర్పడితే ప్రతి ఇంటికి క్యాండిల్ అందించడమే కాకుండా దెబ్బతిన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ప్రాణ నష్టం జరగకూడదు : వర్మ

తుఫాన్‌కు ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సూచించారు. పీఎం లంకలో ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి సముద్రతీరాన్ని పరిశీలించారు. మత్స్య కారులను ఆదుకుంటామని మంత్రి గొట్టిపాటి భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే నాయకర్, మంతెన రామరాజు తదితరులు ఉన్నారు.


ఆగిరిపల్లి మండలం పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సారథి


పీఎం లంకలో సముద్ర తీరం సందర్శించిన కేంద్ర రాష్ట్ర మంత్రులు వర్మ, గొట్టిపాటి, తదితరులు

బియ్యపుతిప్ప వద్ద మొహరించిన అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అంతర్వేదిపాలెం-బియ్యపుతిప్ప సమీపంలో రాత్రి 8-9 గంటల మధ్య మొంథా తుఫాను తీరం తాకినట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో గ్రామస్తులను పునరావాస కేంద్రానికి తరలించేందుకు అధికారులు మొహరించారు. అయితే గ్రామస్తులు మొరాయించడంతో అర్ధరాత్రి 12 గంటల వరకు వేచి చూశారు. వాస్తవానికి సాయంత్రం ఐదు నుంచి రాత్రి ఏడు గంటల మధ్యలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లో బలమైన ఈదురు గాలులు వీచాయి. తీరం తాకే సమయానికి వర్షాలు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాలు ప్రశాంతంగా వున్నాయి.

నేడు విద్యా సంస్థలకు సెలవు

భీమవరం టౌన్/ఏలూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు, అంగన్‌వాడీలకు బుధవారం సెలవు ప్రకటించారు. పిల్లలను బయట తిరగనివ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పశ్చిమ, ఏలూరు జిల్లాల కలెక్టర్లు నాగరాణి, వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని యాజమాన్యాల విద్యా సంస్థలకు డిజాస్టర్ సెలవు వర్తిస్తుందని డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఇంటర్ బోర్డు ఆర్ఐవో యోహాన్ మంగళవారం తెలిపారు.

300 మంది గర్భిణుల తరలింపు

ఏలూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 300 మంది గర్భిణులను పీహెచ్‌సీలకు, సీహెచ్‌సీలకు తరలించామని ఏలూరు జిల్లా వైద్యాధికారి పీ.జే.అమృతం తెలిపారు. పీహెచ్‌సీల్లో ఇద్దరికి మంగళవారం ప్రసవం కావడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వివరించారు.

మునిసిపాల్టీలో ప్రత్యేక చర్యలు

భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు మునిసిపాల్టీల్లో 17 ప్రత్యేక టీమ్‌లు, ఎనిమిది మంది నోడల్ ఆఫీసర్లను నియమించారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు మునిసిపాల్టీల్లో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. చెట్ల తొలగింపు, డ్రెయిన్లలో నీటిపారుదలకు 12 ఎక్స్‌కవేటర్లు, దోమల నివారణకు 67 స్ప్రేయర్స్, మంచినీటి సరఫరాకు 21 వాటర్ ట్యాంకులు, 11 జనరేటర్లు, 13 ట్రీ కటింగ్ మిషన్‌లను అందుబాటులో ఉంచారు.

రేషన్ పంపిణీ ప్రారంభం

భీమవరం టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ నేపథ్యంలో మూడు రోజుల ముందుగా మంగళవారం నుంచి రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి జిల్లాలోని 1,012 రేషన్ డిపోల నుంచి ఐదు లక్షల 57 వేల 018 కార్డులకు బియ్యం, పంచదారను అందించేవారు. ఈసారి తుఫాన్ కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

106 మంది గజ ఈతగాళ్లు సిద్ధం

ఏలూరు, అక్టోబరు 28(ఆంధ్యజ్యోతి):వరద నీటి ప్రవాహం పెరిగితే ప్రజలను తరలించేందుకు వీలుగా ఏలూరు జిల్లాలో వంద బోట్లు, 106 మంది గజ ఈతగాళ్లను మత్స్యశాఖ సిద్ధం చేసింది. మండలానికి ముగ్గురు, ముంపు ప్రాంతాల్లో ఐదుగురు చొప్పున ఏర్పాటుచేశారు. కైకలూరు, మండవల్లి, కలిదిండి ప్రాంతాల్లో ఆక్వా రైతులు, చెరువుల వద్ద కాపలదారులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేసినట్లు మత్స్యశాఖ జేడీ బీనరసయ్య తెలిపారు. గోదావరి పరీవాహక మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో 15 చొప్పున, పోలవరం పరీవాహక ప్రాంతాల్లో 60 ఫిషర్ మెన్ బోట్లను ఉంచారు.

ఐదు వేల ఇసుక బస్తాలు సిద్ధం

ఏలూరు నగరంలో తమ్మిలేరు ముంపు నివారణ చర్యల్లో భాగంగా గట్లు బలహీనంగా వున్నచోట్ల 3,600 ఇసుక బస్తాలను, ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఇరిగేషన్ డివిజన్ కార్యాలయం వద్ద 1,400 ఇసుక బస్తాలు సిద్ధం చేసినట్లు జలవనరుల శాఖ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాశ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 232 చెరువులు డేంజర్ జోన్‌లో ఉన్నట్లు నివేదిక ఆధారంగా అక్కడ వీఆర్వో, గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో పహారా కాస్తున్నారు. ఏలూరు ఆర్అండ్‌బీ సర్కిల్ పరిధిలో 55 జేసీబీలు, 28 పవర్ కటింగ్ యంత్రాలు సిద్ధంగా ఉంచినట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం తెలిపారు.

10 శాతం ఆర్టీసీ బస్సులు రద్దు

ఏలూరు జిల్లాలో తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో పది శాతం బస్సులను నిలుపుదల చేశారు. హైదరాబాద్ వెళ్లే ఇంద్ర బస్సు సర్వీసులను, రాజమండ్రి, భీమవరం, నరసాపురం బస్సు సర్వీసులు కొన్నింటిని రద్దు చేశారు. ప్రయాణాల్లో జాగ్రత్త వహించాలని, ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాలని ఉన్నతాధికారులను ఆదేశాలందినట్లు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో బుధవారం 83 సర్వీసులను రద్దు చేశారు.

తుఫాన్‌పై మంత్రి లోకేశ్ ఫోన్‌లో ఆరా

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి నారా లోకేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి సూచించారు. అమరావతి నుంచి లోకేశ్ వారితో ఫోన్‌లో మాట్లాడి తాజా పరిస్థితులపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు తాను కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటానని, అత్యవసర సమయాల్లో తనను ఎప్పుడైన సంప్రదించవచ్చని ఎమ్మెల్యేకు సూచించారు.

ఏలూరులో ముందస్తు చర్యలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో ముందస్తు రక్షణ చర్యలు చేపట్టినట్లు కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. భారీ హోర్డింగ్‌లకున్న ఫ్లెక్సీలు తొలగించామన్నారు. రేకులషెడ్డులు కూడా తొలగించామన్నారు. వర్షపునీటికి తమ్మిలేరు పొంగిపొర్లితే ఎలాంటి చర్యలు తీసుకోవాలో ముందుగానే కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు.

పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అవసరమైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొంతమంది లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ 2029నాటికి పేదలందరికి పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇంటినిర్మాణానికి రూ.రెండున్నర లక్షలు కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా మంజూరు చేస్తామన్నారు.

● కొయ్యలగూడెంలో పడిపోయిన వరి చేలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం వేదాంతపురం, రాజవరం, గంగవరం, సీతంపేట గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖాధికారి పోశారావు పర్యటించారు. పడిపోయిన వరిపొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా గాడులు కొట్టుకోవాలని సూచించారు. మండలంలో సుమారు 50 హెక్టార్ల వరకు వరి చేలు పడిపోయాయని ఆయన తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది ఉన్నారు.

చల్లచింతలపూడిలో బస్టాండ్‌కు శంకుస్థాపన


ప్రారంభిస్తున్న నాయకులు

దెందులూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చల్లచింతలపూడి గ్రామంలో ప్రయాణికులు, గ్రామస్థుల కోసం నాలుగు రోడ్ల కూడలిలో లక్షా 50 వేల రూపాయలతో నిర్మిస్తున్నట్టు దెందులూరు టీడీపీ మండల కార్యదర్శి నాగనబోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు దాత టీడీపీ యువనేత మొదుగుమూడి వెంకటరాజును పలువురు అభినందించారు. ఏఎంసీ డైరెక్టర్ పునులూరి ప్రసాద్, కమ్మ నాగు, తుంపాటి అంజనేయులు, మొదుగుమూడి శ్రీను, యర్రంశెట్టి నాగరాజు, బీజేపీ మండలాధ్యక్షులు చీకటి లక్ష్మీప్రసన్న, ప్రభుచౌదరి, యుంగధర్ ఉన్నారు.

చిన్నారులు, గర్భిణులకు ఇంటి వద్దకే రేషన్

లింగపాలెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు రెండు రోజులపాటు సెలవులు ప్రకటించడంతో చిన్నారులు, బాలింతల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు రామలక్ష్మి, కుమారి తెలిపారు. మండలంలోని మంగళవారం వేములపల్లి రంగాపురం, లింగపాలెం, బోగోలు, ధర్మాజీగూడెం గ్రామాల్లో పౌష్టికాహారం అందించారు. గర్భిణులను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించామన్నారు.

వాటికన్ సిటీ వేడుకల్లో ఏలూరు పీఠం ప్రతినిధులు



దెందులూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అరుదుగా 50 ఏళ్లకు ఒక్కసారి మాత్రమే జరిగే క్రీస్తు జయంతి వేడుకలకు మహా జూబిలీ ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆర్‌సీఎం ఏలూరు పీఠం పరిధిలో ముగ్గురు ఫాదర్లు పాల్గొన్నారు. వాటికన్ సిటీలో సోమవారం ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. మూడ్రోజులపాటు జరిగే ఈ వేడుకలకు ఏలూరు పీఠం నుంచి సోమవరప్పాడు సెయింట్ జాన్స్ డీఈడీ కాలేజీ సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఫాదర్ పి.బాల, ఏలూరు విచారణ పీఠం ఛాన్సలర్ పాదర్ ఇమ్మానుయేలు, భీమవరం పరిధిలో విచారణ గురువు ఫాదర్ స్టాలిన్ వాటికన్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు.

ఐవీఎఫ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పవన్



ఏలూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా గాజులపల్లి అభినయ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డా.కోనా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహన్‌రావు, పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పవన్‌కుమార్‌ను అభినందించారు.

దెందులూరు ప్రత్యేకాధికారిగా వివేకానంద

దెందులూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పర్యవేక్షణ విధులకు దెందులూరు మండల ప్రత్యేకాధికారిగా హౌసింగ్ డీఈ టి.వివేకానందను కలెక్టర్ నియమించారు. మంగళవారం సింగవరం రోడ్డు పక్కన చిన్న గుడారాల్లో నివాసం ఉంటున్న 20కుటుంబాలను తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో భీమరాజులతో కలిసి పునరావాస కేంద్రానికి తరలించారు. గుండుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వీరందరికీ భోజనం ఏర్పాటు చేయించారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం : చింతమనేని

పెదవేగి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధికారులకు సూచించారు. దెందులూరు డిప్యూటీ ఎంపీడీవోగా బి.ఆశీర్వాదం, పెదపాడు డిప్యూటీ ఎంపీడీవోగా వి.వసంత కుమారి, ఏలూరు రూరల్ డిప్యూటీ ఎంపీడీవోగా డి.శ్రీనివాసరావులు బాధ్యతలు తీసుకుని, స్థానిక ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్.. డిప్యూటీ ఎంపీడీవోలకు ప్రజా సంక్షేమం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం పెంపు

ఏలూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జిల గడువును జనవరి 30వ తేదీ వరకు పొడిగిస్తూ సహకార శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుణ్ణంపల్లి, జీలుగుమిల్లి, కామవరపుకోటల్లో ఉద్యోగులే పర్సన్ ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. పదవీ కాలం గడువు ముగిసిపోవడంతో తాజాగా వారి పదవీ కాలాన్ని పెంచుతూ జీవో జారీ అయ్యింది.

నకిలీ కంపెనీ పేరుతో మోసగించిన ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఒక కంపెనీలో డైరెక్టర్లుగా ఉద్యోగుల్లో ఉంటూ అదే కంపెనీ పేరుతో మరో కంపెనీని రిజిస్టర్ చేసి మొదటి కంపెనీకి సంబంధించిన ఖాతాదారుల నుంచి డిపాజిట్లు వసూలు చేసి మోసగించిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం పంచాయతీ సూరంపూడికి చెందిన బొమ్మగాని బాలకృష్ణ 2021లో ఐఎఫ్‌ఎల్ గ్రీన్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ పేరుతో కంపెనీని ఏర్పాటు చేశారు. 2022 నుంచి జంగారెడ్డిగూడెం బస్టాండ్ వెనుక సూర్యా కాలేజీ సమీపంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లో రైతుల నుంచి పొదుపు డిపాజిట్లు సేకరించి వారికి తక్కువ వడ్డీకి రుణాలివ్వాలని నిర్ణయించారు.ఆ కంపెనీలో డైరెక్టర్లుగా పనిచేస్తున్న తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన వీరంకి శ్రీరాములు, అదే గ్రామానికి చెందిన వంకాయల సతీశ్, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన మండపాక వినోద్ కుమార్‌లు కలిసి మరో కంపెనీని ప్రారంభించి మొదటి కంపెనీకి మోసం చేశారు. లక్షలాది రూపాయల డిపాజిట్లను స్వీకరించడంతో జంగారెడ్డిగూడెం పోలీసులు ఆ ముగ్గురిపై ఈ ఏడాది జూలైలో కేసు నమోదు చేశారు. ఈకేసులో ప్రధాన నిందితుడైన వీరంకి శ్రీరాములును ఇప్పటికే అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులైన వంకాయల సతీశ్, మండపాక వినోద్ కుమార్‌లు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉండగా సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర పర్యవేక్షణలో జంగారెడ్డిగూడెం సీఐ ఎంవి సుభాష్, ఎస్ఐ జబీర్ వారి సిబ్బంది కలిసి ఎయిర్ పోర్టులో వారిని అరెస్టు చేసి తీసుకొచ్చారు. వారిని మంగళవారం జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ ఇద్దరు నిందితులను జంగారెడ్డిగూడెం జైలుకు తరలించారు.

● రైతులు సూచనలు పాటించాలి..

● తుఫాన్ ప్రభావం నుంచి పంటలు కాపాడుకోవడానికి రైతులు తగు సూచనలు పాటించాలని పోలవరం మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు సూచించారు. పట్టిసీమలో నేలకొరిగిన వరి పంటలను ఆయన పరిశీలించారు. పాతపట్టిసీమ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు, పట్టిసీమ ఉప సర్పంచ్ నునకాని రమ్యలతా ధర్మేంద్ర పాల్గొన్నారు.

● నిడమర్రు మండలంలో 3500 ఎకరాల్లో సార్వా సాగు చేపట్టామని, మరో మూడు వారాల్లో వరిచేలు కోతలకు సిద్ధమయ్యే స్థితిలో ఉన్నాయన్నారు.

● కామవరపుకోటలో వీరభద్రస్వామి ఆలయం పరిసరాల్లో టెంట్‌లు వేసుకుని నివసిస్తున్న 30 మందిని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి. రమణ సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం తహసీల్దార్ గెడ్డం ఎలీషా, వీఆర్వోలు ఎస్.కె.మెహబూబ్ సాహెబ్, బి.రమేశ్‌లతో చర్చించారు.

● నిడమర్రులో సాయంత్రం 4 గంటల నుంచి సుమారు గంటకు 120 - 150 కిమీ వేగంతో కూడిన ఈదురుగాలులు మొదలయ్యాయి.

● తెగిపడిన విద్యుత్ వైర్లు.. చెట్ల తొలగింపు.. గట్టు పటిష్టం

పోలవరం మండలంలో పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకి అంతరాయం కలిగింది. విద్యుత్ సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పోలవరం మండలంలో అన్ని గ్రామాల్లో ఎస్ఐ మైక్ ప్రచారం నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు సర్వీసులు లేక ఖాళీగా రాకపోకలు సాగించాయి. వారపుసంత కొనుగోలు దారులు లేక వ్యాపారాలు వెలవెలబోయాయి. దెందులూరులో చెట్లు పడిపోవడంతో తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో భీమరాజు, పంచాయతీ కార్యాలయ జూనియార్ అసిస్టెంట్ అనూష దగ్గరుంచి ఎక్స్‌కవేటర్‌తో పడిపోయిన చెట్ల తొలగించారు. పెదపాడు మండలంలో వీరభద్రపురంలో రహదారికి అడ్డుగా భారీ వృక్షం నేలకూలడంతో ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్, పోలీసు సిబ్బంది సకా లంలో స్పందించి ఎక్స్‌కవేటర్‌తో చెట్టును అడ్డు తొలగించారు. లింగపాలెం మండలం కె.గోకవరంలోని ఎర్ర చెరువు కట్ట తెగే పరిస్థితి ఏర్పడటంతో స్థానిక నాయకులు తహసీల్దార్ నజీముల్లాషా దృష్టికి తీసుకురావడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుగట్టును పటిష్టం చేశారు.

● పెరిగిన ఎల్.ఎన్.డి. పేట రిజర్వాయర్ నీటిమట్టం



● పోలవరం మండలంలో ఎడతెరపిలేని వర్షం కురిసింది. ఏజన్సీ ప్రాంతాల్లో కురిసిన వర్షాల ప్రభావంతో ఎల్లండీపేట రిజర్వాయర్ నీటిమట్టం పెరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో 48 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు ఏఈ రాహుల్ భాస్కర్ తెలిపారు. రిజర్వాయర్ నుంచి విడుదలైన జలాలు పట్టిసీమ అవుట్ పాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలో కలుస్తున్నాయి.

● దెందులూరు- అలుగులగూడెం రహదారిలో గుండేరు వాగు ఉధృతి పెరగడంతో చెక్ పోస్టు ఏర్పాటు చేసి ఎవ్వరూ వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. సత్యనారాయణపురం వైపు కూడా చెక్ పోస్టు ఏర్పాటు చేశారు.

మొంథా ముప్పు..


జంగారెడ్డిగూడెం : పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

● టి.నర్సాపురం మండలంలోని బొర్రంపాలెం గ్రామ పరిధిలోని ఎర్రకాల్వ జలాశయం సమీపంలోని ముత్యాలమ్మ పేటలో నివసిస్తున్న జాలర్ల కుటుంబాలను బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. తహసీల్దార్ సాయిబాబా, ఎస్.ఐ. జయబాబు పర్యవేక్షించగా జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు, టీడీపీ నాయకులు గండబోయిన శ్రీను, వెంకట్రావు పాల్గొన్నారు. టి.నర్సాపురం మండల ప్రత్యేకాధికారి ఆరిమిల్లి శ్రీనివాసరావు జలవాగు, ముగ్గురాళ్ల వాగు, ఎర్రకాల్వలను పరిశీలించారు. ఎంపీడీవో జి.మణికుమారి, కోపరేటివ్ రిజిస్ట్రార్లు లక్ష్మణరావు, వై.ఏసుకుమార్, సొసైటీ సీఈఓలు యూవీవీ సత్యనారాయణ, టి.వీరవెంకయ్య, భుజంగరావు ఉన్నారు.

● జీలుగుమిల్లి మండల ప్రత్యేకాధికారి జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో ఎ.వి.సుబ్బరాయన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీని పరిశీలించారు. 13 సంచార కుటుంబాల్ని గుర్తించి తరలించినట్టు ఎంపీడీవో నిఖిల్ మధు శరణ్ తెలిపారు. బర్రింకలపాడు, వంకవారిగూడెం కాలువల వద్ద కల్వర్టులను డీఎస్పీ బి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. సీఐ బి.వెంకటేశ్వరరావు, తహసీల్దారు ఉదయ్‌భాస్కర్, ఎస్.ఐ. వి.క్రాంతికుమార్‌లు, సీహెచ్‌వో సత్యనారాయణరాజు, హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్ ఉన్నారు.

● లింగపాలెం మండలంలో ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(స్పెషల్ ఆఫీసర్) పి.శ్రీనివాసరావు, తహసీల్దార్ నజీముల్లాషా, ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న, ఎంపీడీవో కె.వాణితో కలిసి తుఫాన్ సహాయ కార్యక్రమాలు పరిశీలించారు. గుడారాలు వేసుకుని నివాసముంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలో ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే లింగపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 95420 68967కు కాల్ చెయ్యాలన్నారు.

● జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో ఎం.వి. రమణ పరిశీలించారు. కొంగువారిగూడెంలోని ఎర్రకాలువ జలాశయాన్ని సందర్శించారు. ఇరిగేషన్ డీఈ సునీతను జలాశయం ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి తుఫాన్ ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు.ఆర్డీవో వెంట తహసీల్దారు కె.స్లీవజోజి ఉన్నారు. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం నుంచే రేషన్ పంపిణీ ప్రారంభించినట్టు ఆర్డీవో ఎంవి.రమణ తెలిపారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతులను అప్రమత్తం చేసిన అధికారులు - లోతట్టు ప్రాంతాల ప్రజలు తరలింపు - విద్యుత్ సరఫరా లేక అవస్థలు

● పెదవేగి మండలం విజయరాయి, బాపిరాజుగూడెం శివారు రామచంద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తుఫాను సహాయక శిబిరాలను మండల ప్రత్యేకాధికారి రామ్‌కుమార్, తహసీల్దారు ఎస్డీ భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమార్, ఎస్ఐ కె.రామకృష్ణ పరిశీలించారు.

● పెదపాడు మండలం ఏపూరులో శిబిరాన్ని ఏర్పాటు చేసి భోజన ఏర్పాట్లు చేశారు. భారీ హోర్డింగ్స్‌ను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. వీటన్నింటినీ తహసీల్దారు కృష్ణజ్యోతి పర్యవేక్షించారు.

● నిడమర్రులో పునరావాస కేంద్రాలకు తరలించడానికి సిద్ధం చేసిన వాహనాలను దుర్గాప్రసాద్ పరిశీలించారు. భువ్వనపల్లిలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును తహసీల్దార్ పరిశీలించారు.

● దెందులూరు మండలం పోతునూరు గ్రామంలో పంట పొలాలను మండల వ్యవసాయ శాఖ ఎల్.శ్రీనివాసరాజుతో కలిసి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా పరిశీలించారు. పోతునూరు బ్యాంక్ అధ్యక్షుడు బోడేటి మోహన్ బాబు, పార్టీ అధ్యక్షుడు నున్న లక్ష్మణ్, నీటి సంఘం అధ్యక్షులు చలసాని రాంబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సురేష్, మోహన్ ఉన్నారు.

● పెదపాడు మండలంలో నేలకొరిగిన వరి, అపరాల పంటలను ఏవో షేక్ ఇమామ్ ఖాసింతో కలిసి ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త ఎన్. నాగేంద్రబాబు పరిశీలించారు. ఎంటీయూ 1061 నేలకొరిగిందని, మినుము మొలకెత్తిందన్నారు.

● భీమడోలు మండలంలో నేలకొరిగిన వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా పరిశీలించారు. మండలంలో 12600 ఎకరాల్లో వరి సాగు జరగగా స్వర్ణ, స్వర్ణ సంపత్ రకాలు ఈదురు గాలులకు వర్షంతో నేలకొరిగాయి.

● కుక్కునూరు మండలంలోని కొత్తలంకాలపల్లి, ఇసుకపాడు, నల్లకుంట గ్రామాల్లో అధికారులు పర్యటించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎస్.ఐ. రాజారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్ ఉన్నారు.

● లింగపాలెం మండలంలో వరిపొలాలు పరిశీలించిన మండల వ్యవసాయాదికారి వి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ వరికోతలను వాయిదా వేయాలన్నారు. ఉద్యాన పంటలు పడిపోకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.


కె.గోకవరంలో చెరువు గట్టు పటిష్టం పనులు

● నిడమర్రు మండలంలో నాలుగు రోజులుగా వాతావరణం చల్లబడటంతో ఆక్వా రైతులు జాగ్రత్తలు చేపడుతున్నారు. కొన్ని చెరువుల్లో వైరస్ వ్యాప్తి చెందడంతో అర్ధంతరంగా రొయ్యలు పట్టుబడులు చేపడుతున్నారు. చేపల చెరువుల్లో మేతను నిలుపుదల చేస్తున్నారు. అక్టోబరు చివరిలో వచ్చిన ఈ మొంథా తుఫాను ఇటు వరి రైతులను, అటు రొయ్య, చేపల రైతులను తీవ్రంగా నష్టపరిచింది.


టి.నరసాపురం : జాలర్ల కుటుంబాలను తరలిస్తున్న అధికారులు


భీమడోలులో నేలకొరిగిన పంట చేలను పరిశీలిస్తున్న హబీబ్‌బాషా


భీమడోలులో అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు


జీలుగుమిల్లి: అశ్వారావుపేట వాగు వద్ద పోలీసులు


గుండేరు వాగు ఉధృతితో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు


పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి


లింగపాలెంలో పర్యటిస్తున్న అధికారులు

అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యేలు


ద్వారకా తిరుమల పోలీస్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ పరిశీలిస్తున్న మద్దిపాటి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు ఎమ్మెల్యే చంటి అన్నారు. తంగెళ్లమూడి మసీదులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమ్మిలేరు ప్రాంతంలో లంకపేట, ఇజ్రాయిల్‌పేట ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట ఇడా చైర్మన్ పి.శివప్రసాద్, కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు ఉన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎమ్మెల్యే చంటికి పలు సూచనలు చేశారు.

● ద్వారకాతిరుమల: ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన తుఫాన్ ప్రభావంపై మండల ప్రత్యేక అధికారి ముక్కంటి నేతృత్వంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే మండల అధికారులు 101 మందిని ద్వారకాతిరుమల ప్రభుత్వ పాఠశాల, గొల్లగూడెం ప్రాథమిక పాఠశాల, రామన్నగూడెం, గుణ్ణంపల్లి జడ్పీ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాలకు తరించారు. మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి, టిడిపి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మొగతడకల శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో మంగళవారం పండ్లు అందజేశారు. పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్‌కుమార్, టీడీపీ నేతలు పాకనాటి శేషబాబు, మహంకాళి గంగాధరరావు, మొయ్య శివకుమార్, తేలు భరత్ పాల్గొన్నారు.

● భీమడోలు: తుఫాను నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సూచించారు. భీమడోలు, గుంటూరు, పూళ్ళ గ్రామాల్లో ఎమ్మెల్యే మంగళవారం పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గుండుగొలనులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎమ్మెల్యేతో పాటు ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్ట నివారణకు చర్యలు : ముప్పిడి


వైద్యశిబిరం పరిశీలిస్తున్న ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రతతో కలిగే నష్ట నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మె ల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూ రు పట్టణంలోని బ్రిడ్జిపేట, నందమూరు రోడ్, లేఅవుట్ 33 వద్ద జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సిద్దా దుర్గాప్రసాద్, బొల్లిన శివ నాగేంద్ర, మున్సిపల్ ఏఈ సుమంత్ పాల్గొన్నారు.

● తాళ్లపూడి: తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా కూటమి ప్రభుత్వం అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అన్నదేవరపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సిద్దా దుర్గారావు, నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి పాల్గొన్నారు. తాళ్లపూడిలోని మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సూరపనేని చిన్ని, సిద్దా దుర్గాప్రసాద్, బొల్లిన శివ నాగేంద్ర, మున్సిపల్ ఏఈ సుమంత్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో ఐదు వేల ఎకరాల్లో వరి నేలమట్టం

కొవ్వూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్టు ప్రాథమికంగా గుర్తించామని కొవ్వూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కొవ్వూరు మండలంలో ప్రాథమికంగా 550 ఎకరాల్లో వరి పంట నేలకొరిగినట్టు గుర్తించామన్నారు. మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

విరిగిపడిన చెట్లు: తుఫాన్ ఈదురుగాలులకు కొవ్వూరు పట్టణంలోని పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట నేరేడుచెట్టు, ఆర్టీసీ గ్యారేజ్ వెనుక చికెన్‌షాపు ఎదురుగా ఒకటి, వేములూరు రోడ్‌లో అవంతి ఫ్యాక్టరీ ఎదురుగా ఒకటి, రైల్వేస్టేషన్ ఎదుట లిటరరీ క్లబ్ షాపుల వద్ద ఇకటి విరిగిపడ్డాయి.

విద్యుత్ సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ

గోపాలపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గోపాలపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకున్నట్టు తూర్పు గోదావరి విద్యుత్‌శాఖ ఎస్ఈ కే.తిలక్ కుమార్ తెలిపారు. మండలంలోని నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్లను మంగళవారం ఆయన దగ్గరుండి తొలగించారు. అనంతరం గోపాలపురం నుంచి చెరుకుమిల్లి వరకు ఉన్న 11కేవీ విద్యుత్ లైను, కోమటిగుంట విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నందిగూడెం వరకు ఉన్న విద్యుత్ లైను, చిట్యాల సబ్‌స్టేషన్ పరిధలో విద్యుత్ సరఫరా చేసే విద్యుత్‌లైన్లను పరిశీలించారు. అలాగే ఆయా ప్రదేశాల్లో జేసీబీలు, ట్రాక్టర్లు, విద్యుత్ పరికరాలతోపాటు 50 మంది కూలీలను సిద్ధంగా ఉంచామన్నారు. ఆయన వెంట ఏడీఏ చంద్రశేఖర్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

చాగల్లు మండలంలో నిలిచిన విద్యుత్..

● చాగల్లు: మండలంలో మొంథా తుఫాన్ కారణంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గంటల కొద్దీ విద్యుత్

గోపాలపురం/కొవ్వూరు సమాచారం

సరఫరా నిలిచిపోయింది. కోతలకు వచ్చిన వరి చేలు నేలమట్టమయ్యాయి. మార్కొండపాడులో రైల్వే గేటుకు వెళ్లే మెయిన్‌రోడ్డుపై టేకు చెట్టుపడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి చెట్టును అడ్డు తొలగించారు.

తవ్వకాల్లో బయటపడ్డ పురాతన విగ్రహం



గోపాలపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని వినాయక, సీతారాముల ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఆలయ ధర్మకర్తల కుటుంబానికి చెందిన ము ప్పిడి సుబ్బారెడ్డి ముందుకొచ్చి నూతనంగా ఆలయం నిర్మిం చేందుకు పూనుకున్నారు. ఈ క్రమంలో ఆలయాన్ని పడగొట్టి మట్టిని గ్రామ శివారుకు తరలిస్తుండగా అంజనేయస్వామి విగ్రహం బయటపడింది. దీన్ని గమనించిన స్థానికులు ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి విగ్రహాన్ని శుభ్రం చేసి ఆలయం వద్దకు తీసుకెళ్లారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మద్దిపాటి

గోపాలపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం గోపాలపురంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలతోపాటు కంట్రోల్ రూమ్‌ను ఆయన పరిశీలించారు.





నేలకూలిన విద్యుత్ స్తంభాలు.. యలమంచిలి మండలం మేడపాడు.. గణపవరం మండలం మొయ్యేరు.. పోడూరు మండలం కొమ్ముచిక్కాల.. పెనుగొండ గ్రామాల్లో విరిగి పడిన విద్యుత్ స్తంభాలు



మొంథా ఎఫెక్ట్

మొంథా తుఫాన్ ప్రభావం ఉమ్మడి జిల్లాపై పడింది. మంగళవారం ఈదురు గాలులతోపాటు కురిసిన భారీ వర్షంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భారీ వృక్షాలు సైతం నేలమట్టం అయ్యాయి. రహదారులు నీట మునిగాయి. వరి పనలు వాలిపోయాయి.



ఉండ్రాజవరం మండలం పాలంగిలో పడిన చెట్టు తొలగింపు

కలిదిండి మండలం కోరుకొల్లులో షెడ్డుపై కూలిన చెట్టు



కొత్తకాయలతిప్పలో ఊగిపోతున్న కొబ్బరి చెట్లు

నరసాపురంలో నేలకొరిగిన భారీ వృక్షం



పోలవరంలో వరి పంటకు కట్టలు కడుతున్న రైతులు



తణుకులో బిల్డింగ్‌పై వారిన చెట్టు



ఏలూరుపాడు హైస్కూల్ సమీపంలో కూలిన భారీ వృక్షం.. ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



పేరుపాలెం పునరావాస కేంద్రంలో వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే జానకీరామ్



ఆకివీడు చెంచుల కాలనీలో బాధితులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు, కూటమి నేతలు



కాళ్ల మండలం కలవపూడి శివారు మోడి గ్రామంలో మునిగిన రహదారి



దెందులూరు మండలం పోతునూరులో దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ బాషా



పెదపాడు-వీరభద్రపురంలో నేలకూలిన చెట్టును ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్న పోలీసు సిబ్బంది

ఎన్టీఆర్ ఉచిత వైద్య చికిత్సలకు ప్రత్యామ్నాయ చర్యలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):దీర్ఘకాలంగావున్న బకాయిలను చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో గతకొన్ని రోజులుగా ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేసిన ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొనాలని ప్రైవేటు వైద్యకళాశాలల యాజమాన్యాలు నిర్ణయించడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అప్రమత్తమయ్యాయి. ప్రైవేటు వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉండే బోధనాసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత వైద్యచికిత్సలు నిలిపివేయనుండడంతో రోగులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేసినట్టు వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ వెల్లడించారు. జిల్లాలో ఉచిత వైద్య చికిత్సల నిమిత్తం 32 ప్రైవేటు ఆసుపత్రులు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టులో నెట్‌వర్క్ ఆసుపత్రులుగా నమోదయ్యాయి. వీటిలో ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల, గుడ్ సమరిటన్ కేన్సర్ ఆసుపత్రికి అధికంగా రోగులు వస్తుంటారు. తాజాగా బుధవారం నుంచి ఆశ్రం వైద్యకళాశాల బోధనాసుపత్రిలో ఈ పథకంలో రోగులను చేర్చుకోబోమని యాజమాన్యం మంగళవారం నోటీసు అందజేసిందని తెలిపారు. ఈమేరకు ఇతర రోగాలతో బోధనాసుపత్రికివచ్చే పేషెంట్లను ప్రభుత్వాసుపత్రి, విజయవాడలోని సర్వజన ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా అక్కడ 108 అంబులెన్స్‌లు, వైద్యమిత్రలను ముందస్తుగా నియమించినట్టు వివరించారు. ఆ మేరకు ఉచిత వైద్య సేవలకోసం వచ్చే రోగులెవ్వరికీ ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టామన్నారు.

ఏలూరు జిల్లా ప్రత్యేక పోలీస్ అధికారిగా ఆక్టోపస్ డీఐజీ సెంథిల్ కుమార్

» ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను అభినందించిన డీఐజీ

ఏలూరు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం చేపట్టిన చర్యలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కిశోర్ ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించడం ఉత్తమ పద్ధతిగా ఉందంటూ జిల్లా ప్రత్యేక పోలీసు అధికారి ఆక్టోపస్ డీఐజీ ఎస్.సెంథిల్‌కుమార్ ప్రశంసించారు. ఏలూరు జిల్లాకు ప్రత్యేక పోలీస్ అధికారిగా నియమించబడిన ఆక్టోపస్ డీఐజీ ఎస్.సెంథిల్ కుమార్ మంగళవారం రాత్రి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీతో సమావేశం అయ్యారు. జిల్లా పరిస్థితులను, పోలీస్ శాఖ చేపట్టిన చర్యలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు.

హోర్డింగ్‌లకు ఉన్న ఫ్లెక్సీల తొలగింపు

నష్టం జరిగితే యజమానులే బాధ్యులు : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రాణ నష్టం కాని, ఆస్తి నష్టం కాని సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో జిల్లా అధికారులు అప్రమత్తత చర్యలను చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ పలు ప్రకటనల హోర్డింగులు భారీఎత్తున జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేశారని, అవి తుపాను సమయంలో వీచే బలమైన గాలులు వల్ల అవి పడే అవకాశం ఉన్న దృష్ట్యా హోర్డింగ్‌లకు వున్న ఫ్లెక్సీలను తక్షణం తొలగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. చేపలు, రొయ్యల చెరువులపై నివాసం ఉండే కార్మికులను తక్షణం అక్కడ నుంచి ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు తీసుకురావాలని, వారు మరణిస్తే సంబంధిత యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.

తుఫాన్ల రాజ్యం కోస్తాంధ్ర

» మొంథా అంతా అలజడి
» 1996 బీభత్సం ఇంకా కళ్లెదుటే..

గోదావరి జిల్లాలకు ప్రతి ఏటా నష్టమే

(ఏలూరు సిటీ-ఆంధ్రజ్యోతి):

కోస్తా జిల్లాలంటే ఓ తుఫాన్ రాజ్యం. ఈ ప్రాంతానికి తుఫాన్ ఓ దుఃఖదాయిని. ఏటా ఏదో విధంగా ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతూ ఉంటాయి. బయటి ప్రపంచానికి కోస్తా అంటే బాగా సంపన్న ప్రాంతంలా కనిపిస్తోంది. కానీ ప్రకృతి వైపరీత్యం వచ్చినప్పుడల్లా రైతులు, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుం టారు. ఈసారి మొంథా తుఫాన్ గోదావరి జిల్లాలపై కన్నేసింది. 1990 మచిలీపట్నం తుఫాన్, 1977 దివిసీమ ఉప్పెన, 1996 కోనసీమ తుఫాన్, 2014 హుద్‌హుద్ తుఫాన్‌లతో విధ్వంసాలు జరిగాయి. ప్రస్తుతం మొంథా తుఫాన్ ముంచేస్తుందేమోననే ఆందోళన ప్రజల్లో ఉంది. ఎందుకంటే మచిలీపట్నం-కాకినాడ మధ్య కేంద్రీకృతమైందనే సమాచారంతో ఆందోళన చెందుతున్నారు.



1996 తుఫాన్ తీవ్రత (ఫైల్)



1996 తుఫాన్ తీవ్రతకు నేలమట్టమైన కొబ్బరిచెట్లు (ఫైల్)

దివిసీమ ఉప్పెన(1977)

1977 నవంబరు 14న వచ్చిన దివిసీమ ఉప్పెన కృష్ణా డెల్టా ప్రాంతంపై అత్యంత తీవ్ర ప్రభావం చూపించడంతోపాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై ఆనాడు ప్రభావం చూపించింది. దివిసీమలో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా ఆనాడు ఆ ప్రాంతంలో ఆరు మీటర్లు ఎత్తున అలలు ఎగసి పడ్డాయని, తుపాను తర్వాత వందలాది శవాలు ఆ నీళ్లలో తేలుతూ కనిపించాయని చెబుతుంటారు. గుర్తుపట్టలేనంతగా దెబ్బతిన్న అనేక శవాలను ఆనాడు సామూహిక దహనం చేయాల్సి వచ్చిందని చెబుతుంటారు. జిల్లాపై ఆనాడు ఈ ఉప్పెన పెను ప్రభావం చూపించిందని, ఆరోజు కాళరాత్రిగా చరిత్రలో మిగిలిపోయిందని చెబుతున్నారు. ఆనాడు 250 మీటర్లు వేగంతో పెనుగాలులు మూడు నిమిషాలపాటు, 205 కిలోమీటర్లు వేగంతో గాలులు ఒక నిమిషం పాటు వీచాయని చెబుతుంటారు. ఆనాడు తుఫాన్ కలిగించిన తీవ్ర నష్టంతో ఆంధ్రప్రదేశ్ తీరం పొడవున వాతావరణ హెచ్చరిక కేంద్రాల ఏర్పాటుకు దారితీసిందని చెబుతున్నారు. శాశ్వత తుఫాన్ సహాయ శిబిరాలను తీరం పొడవునా ఏర్పాటు చేశారు.

పెను తుఫాన్(1996)

ఇక 1996 సంవత్సరం నవంబరు 6వ తేదీన రాత్రి కాళరాత్రిగా చరిత్ర పుటల్లో మిగిలిపోతుంది. ఆ రోజు వచ్చిన పెనుతుపాను కోనసీమ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆనాటి తుఫాన్ బీభత్సం కోనసీమ ప్రాంత ప్రజల కళ్లెదుట నేటికీ కదలాడుతూనే ఉంది. నాటి బీభత్సం ఇవాళ కథలుగా వైరల్ అవుతోంది. నాడు సుమారు 215 కిలోమీటర్ల వేగంతో గోదావరి జిల్లాల మీద గాలులు విరుచుకుపడ్డాయి. ఇళ్లపైకప్పులు ఎగిరిపోయాయి. చెట్లు నేలకొరిగాయి. ఆ తుఫాను ప్రభావం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపై కూడా చూపించిందని, ఆ రోజున రాత్రి 160 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచాయని, జీఎన్‌టీ రహదారిపై ఏలూరు నుంచి రాజమండ్రి వరకు చెట్లు నేలకూలాయని చెబుతుంటారు. ఉదయం లేచి చూడగానే జరిగిన విధ్వంసాన్ని చూసి కన్నీరు పెట్టనివారు లేరు, ఆ తేదీని జిల్లా వాసులు ఎప్పుడు పెనుతుపాన్ హెచ్చరికలు వచ్చినా మరువలేకపోతున్నారు. అదో కాళరాత్రి. 1077 మంది మృతి చెందారు. రూ.వేల కోట్ల ఆస్తినష్టం జరిగింది. తుఫాన్‌కు ముందురోజు 2,25,000 కుటుంబాలను అధికారులు తరలించారు. అప్పట్లో తుఫాన్ షెల్టర్లు ఉన్నా, అంతంత మాత్రమే. మత్స్యకార గ్రామాలైన భైరవపాలెం, బలుసుతిప్ప పూర్తిగా దెబ్బతిన్నాయి. అమలాపురంలో ఏకంగా 390 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 5,97,510 ఎకరాల పంట నష్టపోయింది. 2లక్షల33 వేల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. 40వేలకు పైగా ఇళ్లు నేలమట్టం అయ్యాయి. చెట్లు కూలిపోయి, ఇళ్లు పడిపోవడంతో తీవ్రనష్టం జరిగింది. ఆ రోజు సాయంత్రం వరకు వాతావరణం పొడిగా ఉంది. తుఫాన్ ముందు ప్రశాంత అంటే అదేనేమో. రాత్రి సుమారు ఏడు గంటల నుంచి మొదలై రాత్రి పది గంటల తర్వాతే బీభత్సం సృష్టించింది. అప్పుడు కూడా తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. నారా చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రిగా ఉన్నారు. నాడు అధికారుల హెచ్చరికలను సైతం లెక్క చేయకుండా మత్స్యకార గ్రామానికి హెలికాప్టర్‌లో వెళ్లి పరిస్థితిని చూసి తల్లడిల్లిపోయారు. వెంటనే రాజమహేంద్రవరం కేంద్రం మినీ సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టారు.

మొంథా తుఫాన్.. ఆందోళన

గత అనుభవాల దృష్ట్యా మొంథా తుఫాన్ వల్ల ఏ బీభత్సం జరుగుతుందోననే ఆందోళన మొదలైంది. కానీ గతంకంటే సమాచార వ్యవస్థ బాగా మెరుగుపడడం వల్ల ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సహాయకచర్యలకు సిద్ధమైంది.

పెను తుఫాన్‌లు - అపార నష్టం

- 1971 నుంచి 2025 వరకు పరిశీలిస్తే 60 తుఫాన్‌లు, పెను తుఫాన్‌లు కోస్తా ప్రాంతాల్లో తీరాన్ని తాకి అపార నష్టాన్ని కలిగించాయి. వీటిలో ముఖ్యమైనవి.
- 1971 సెప్టెంబరు నుంచి 1976 వరకు ఆరు సూపర్ సైక్లోన్‌లు ఉత్తరాంధ్ర, గోపాల్‌పూర్, బారువ, శ్రీహరికోట, నెల్లూరు అండ్ కావలి, నెల్లూరు ప్రాంతాల్లో తీరాన్ని తాకాయి.
- 1977లో దివిసీమ ఉప్పెన జిల్లాను అతలాకుతలం చేసింది.
- 1979 నుంచి 1994 వరకు పలు తుఫాన్‌లు, పెను తుఫాన్‌లు కోస్తా తీరాన్ని తాకాయి.
- 1996 నవంబరు 6న కాకినాడ వద్ద అత్యంత హరికేన్ అని పిలువబడే సూపర్ సైక్లోన్ తీరాన్ని తాకి విధ్వంసం సృష్టించింది.
- 1999 నవంబరు 15న విశాఖపట్నంలో పెను తుఫాన్ అలజడి సృష్టించింది.
- 1999 నుంచి 2005 మధ్య రెండు పెను తుఫాన్లు వచ్చాయి.
- 2006లో ఓగ్ని ఒంగోలు-మచిలీపట్నం మధ్య తుపానుగా తీరం దాటింది.
- 2008 నవంబరు 16న కావలి వద్ద ఖైముక్ అనే తుఫాన్ తీరం దాటింది.
- 2010 మే 20న బాపట్లలో లైలా పెను తుఫాను తీరం తాకింది.
- 2013లో ఫైలాన్ తుఫాన్ గోపాల్‌పూర్ వద్ద తీరం తాకింది.
- 2013 నవంబరు 22న మచిలీపట్నం వద్ద హెలెన్ అనే సూపర్‌సైక్లోన్ వచ్చింది.
- 2014 అక్టోబరు 12న విశాఖపట్నంలో హుద్‌హుద్ అనే పెనుతుఫాన్ తీరం తాకింది.
- 2018 అక్టోబరులో తిత్లీ అనే పెనుతుఫాన్ శ్రీకాకుళం జిల్లా పలాస వద్ద,
- 2018 డిసెంబరు 17న పెథాయ్ పెను తుఫాన్ కాకినాడ వద్ద,
- 2021 సెప్టెంబరు 26న గులాబ్ తుఫాన్ కళింగపట్నం వద్ద,
- 2023 డిసెంబరు 5న మిచాంగ్ సూపర్ సైక్లోన్ నెల్లూరు-మచిలీపట్నం మధ్యలో తీరం దాటాయి. ఈ తుఫాన్లు చాలా వరకు జిల్లాపైన ప్రభావం చూపాయి.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ భార్య మృతి

» భర్త పరిస్థితి ఆందోళనకరం



భానుపూర్ణిమ(ఫైల్)

భీమడోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధాల నేపథ్యంలో మనస్తాపానికి గురై కలుపు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన భార్యాభర్తల ఘటనలో భార్య భానుపూర్ణిమ(22) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 25న మనస్తాపానికి గురైన భార్యాభర్తలు గుండుమోలు సుధాకర్, భానుపూర్ణిమ సూసైడ్ నోట్ రాసి విషం తాగారు. వారిని తొలుత ఏలూరు, మెరుగైన చికిత్సకు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున ఆమెమృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):ఏలూరు వంగాయగూడెంలో ఉన్న కేన్సర్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వంగాయగూడెంకు చెందిన వారా జోజి (56) గత పదేళ్ల నుంచి ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం బాత్‌రూమ్‌ను శుభ్రపరుస్తుండగా స్విచ్ బోర్డుకు విద్యుత్ ప్రవహించి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ముసునూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది. ఎస్‌ఐ ఎం.చిరంజీవి వివరాల ప్రకారం లోపూడి గ్రామానికి చెందిన పేరం జయమ్మ(47) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ నెల 27న ఉదయం పశువులను మేతకు తోలుకుని వెళ్లగా విపరీతమైన కడుపు నొప్పి రావడంతో పొలంపక్కనే చెట్టు కింద పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను పశువుల కాపరులు ఇంటికి తీసుకువెళ్లగా ఆమె కుమారుడు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతున్న జయమ్మ మధ్యాహ్న సమయంలో మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

ఇరగవరంలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఇరగవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలేటిపాడు, గోటేరు, అయినపర్రు గ్రామాల్లోని మూడు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీవో శ్రీ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలేటిపాడులో అంగన్‌వాడీ కార్యకర్త, గోటేరు, అయినపర్రు గ్రామాలకు సహాయకురాలు పోస్టులకు పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలను ఐసీడీఎస్ కార్యాలయంలో తెలుసుకోవచ్చునని తెలిపారు.

యలమంచిలిలో అత్యధిక వర్షపాతం

భీమవరం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో కురిసిన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం 8-30 ప్రాంతం నుంచి మంగళవారం ఉదయం 8-30 వరకు వర్షపాతాన్ని నమోదు చేశారు. అత్యధికంగా యలమంచిలి 53.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా మొగల్తూరు 42.2, నరసాపురంలో43.6, పాలకొల్లు48.8 వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా తాడేపల్లిగూడెంలో 14 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కలవపూడి పునరావాస కేంద్రం పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

కాళ్ళ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలవపూడి హైస్కూల్‌లో తుఫాన్ బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో బాధితులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, భోజన వసతి, తాగునీరు, టాయిలెట్స్, శానిటేషన్, జనరేటర్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏటిగట్టు దిగువన పల్లపు ప్రాంతాల్లో నివాసాలు ఉన్న గృహాలను పరిశీలించారు.

పునరావాస కేంద్రానికి రాని ప్రజలు

పెనుమంట్ర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): క్వాల గట్టుపైనే ఉన్నవారిని తుఫాన్ దృష్ట్యా పునరావాస కేంద్రాలకు రావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎలియమ్మ కోరారు. అయితే ప్రజలు మాత్రం రావటానికి సుముఖత వ్యక్తం చెయ్యలేదు. మూగ జీవాలను వదిలి రాలేమని స్పష్టం చేశారు. వారిని ఒప్పించి ఆటోల్లో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఇబ్బందులు పడ్డారు. పొలమూరులోని పునరావాస కేంద్రానికి 50మందిని తరలించారు.

కంట్రోల్ రూమ్ పరిశీలించిన జేసీ

భీమవరంటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. కాల్స్ వివరాలను ఆయన అడిగి తెలుసుకుని మండల, డివిజనల్ కాల్ సెంటర్‌కు వచ్చిన సమస్యలను వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి ఉన్నారు.

వరిని దుబ్బులు కట్టుకోవాలి

పెనుగొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):పొలాల్లో నీరు నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. వడలి,సిద్ధాంతం గ్రామాల్లో తుఫాన్ నేపథ్యంలో రైతులను కలిసి వారిని అప్రమత్తం చేశారు. గాలులకు చేలు నేలకొరిగితే వాటిని నిలబెట్టుకుని దుబ్బులుగా కట్టుకోవాలన్నారు. చేలు తయారైనట్లు అయితే గింజలు మొలకెత్తకుండా కళ్ళు ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు.

రైతులకు ప్రభుత్వం అండ

తణుకు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం దువ్వ, తేతలి గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తుఫాన్ కారణంగా పంట నష్టం జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.

సచివాలయాల్లో కాల్ సెంటర్లు

భీమవరం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఐదు మునిసిపాలిటీల్లోని వార్డు సచివాలయాల్లో కాల్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. 24 గంటలు పని చేసే విధంగా సిబ్బందిని నియమించారు. మునిసిపాలిటీల్లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు.

ఉధృతంగా ఎర్ర కాలువ



మాధవరం-కంసాలిపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ రైతులను వణికిస్తోంది. ఒక పక్క వరిచేలు కోత దశకు చేరడంతో రైతులు ఈ గండం గడిస్తే చాలు దేవుడా అని మొక్కుకుంటున్నారు. మండలంలో మాధవరం, అప్పారావుపేట, జగన్నాథపురం, మారంపల్లి, నందమూరు, ఆరుళ్ల గ్రామాల రైతులు దినదిన గండంగా గడుపుతున్నారు. ఎగువన కొంగువారిగూడెం ప్రాజెక్టుకు వరదనీరు ఉధృతంగా వస్తుండటంతో వారి భయం మరింత పెరుగుతోంది. మంగళవారం 3500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలడంతో కాలువ ఉప్పొంగుతోంది.







తణుకులో ఆంధ్రాషుగర్స్ వద్ద రోడ్డుపై పడిన చెట్టు.. పెనుగొండలో ఈదురు గాలులు.. మహదేవపట్నంలో గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

తుఫాన్ విధ్వంసం

ఈదురు గాలులు.. కూలిన చెట్లు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

నీట మునిగిన పొలాలు.. పల్లపు ప్రాంతాలు జలమయం

కాళ్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీట మునిగింది. ప్రధానంగా కాళ్ల, కోపల్లె, కోమటిగుంట, ఏలూరుపాడు తదితర గ్రామాల్లో కోత దశకు వచ్చిన విత్తన పంట నీట మునగడంతో రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. కాలువల్లోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు చేలల్లోకి రావడంతో వరికంకులు మునిగిపోయాయి.

పాలకోడేరు: తుఫాన్ వల్ల పంటల నష్టం తగ్గించడానికి రైతులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి బి.సంధ్య ఆధ్వర్యంలో గరగపర్రు గ్రామంలో పర్యటించారు. రైతులకు పలు సూచనలు చేశారు.

తణుకు: వేల్పూరు రోడ్డులోని ఆంధ్రాషుగర్స్ సమీపంలో ఒక భారీ చెట్టు రోడ్డుకు మధ్యలో పడిపోయింది. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలంలో చెట్టును తొలగించే కార్యక్రమం చేపట్టారు. పిండిమరల వీధిలో కూడా చెట్టు పడిపోయింది. ఇరగవరం కాలనీ హెల్త్ సెంటర్ సమీపంలో ఉన్న సెల్ టవర్ కొద్దిగా వాలిపోయింది. బాలురున్నత పాఠశాల పునరావాస కేంద్రంలో బస కల్పించారు. మధ్యాహ్నం 75మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం కూడా 150మందికి భోజనాలు సిద్ధం చేస్తున్నట్లు తహసీల్దార్ అశోక్ వర్మ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు.

ఆచంట:తుఫాన్ కారణంగా మంగళవారం ఉదయం ఏకధాటిగా ఈదురు గాలులు జోరువానకు పడుతూనే ఉన్నది. దీంతో ప్రజలు ఇంటికే పరిమితం అయ్యారు. గాలులు దృష్ట్యా విద్యుత్‌శాఖ అధికారులు ముందుగానే విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు.

పెనుగొండ:వర్షాలు,ఈదురుగాలులకు మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పెనుగొండ శివారు చెరువుగట్టు ప్రాంతంలో మంగళవారం ఉదయం కొబ్బరి చెట్టు విరిగి ఒక ఇంటిపై పడింది. దీంతో పెనుగొండ- మునమర్రు రహదారి రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు రెండు గంటలు సమయం వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. పల్లపు ప్రాంతాలరోడ్లు జలమయం అయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి విద్యుత్‌సరఫరా నిలిపి వేయడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

యలమంచిలి: భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షపు జల్లులు కురిశాయి. ఈదురుగాలుల తీవ్రత గంటగంటకూ పెరుగుతోంది. యలమంచిలి, చించినాడ, మేడపాడు, బాడవ, ఏనుగువానిలంక, దొడ్డిపట్ల, కనకాయలంక తదితర గ్రామాల్లో చాలాచోట్ల కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు పడిపోయాయి. పడిపోయిన చెట్లను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించే పనులు చేపడుతున్నారు. ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

పెనుమంట్ర:నెగ్గిపూడి రామాలయం వద్ద కొబ్బరి చెట్టు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బ్రాహ్మణ చెరువు మార్టేరు రహదారిపై బ్రాహ్మణ చెరువు వద్ద చెట్టు పడటంతో విద్యుత్‌లైన్‌లు తెగిపడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చెట్లు తొలగించారు. పొలమూరులో జమ్ముచెరువు గట్టునకొబ్బరి చెట్టు చింత చెట్టు విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బ్రాహ్మణచెరువు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిద్రగన్నేరు చెట్టు ఇరిగేషన్ కార్యాలయంపై నేలకొరిగింది.





యలమంచిలిలో పడిపోయిన విద్యుత్ స్తంభం.. పెనుమంట్రలో చెట్టు పడిపోవడంతో తెగిన విద్యుత్ వైర్లు

కాళ్ల: ఏలూరుపాడు హైస్కూల్ వద్ద రాష్ట్రీయ రహదారిపై మంగళవారం సాయంత్రం భారీ వృక్షం నేలకూలింది. నిత్యం వందలాది వాహనాలు వెళ్ళే ఈ మార్గంలో ఆ సమయంలో ఎవ్వరూ అటు వైపు వెళ్ళకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభంపై చెట్టుపడటంతో ముక్కలైంది. విద్యుత్ సరఫరా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శివారు గ్రామాలైన మోడి, బోస్ కాలనీ, గోగుతిప్ప, గాంధీ నగర్ గ్రామాలకు వెళ్ళే రహదారులు నీట మునిగిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలగడంతో శివారు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మోడీ వంతెన వద్ద ఉప్పుటేరు ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

గణపవరం: మొయ్యేరులో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులకు మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అధికారులు ముందస్తుగానే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడంతో ప్రమాదం జరగలేదు.

ఉండి: చెరుకువాడలోని యానాదుల కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వారిని స్థానిక మండల పరిషత్ పాఠశాలకు తరలించారు. మహదేవపట్నంలో గర్భిణి ఎస్తేరురాణికి నొప్పులు రావడంతో ఆమెను వర్షంలో అంబులెన్సులో భీమవరం ఆసుపత్రికి అధికారులు తరలించారు. ఎస్‌ఆర్‌పి అగ్రహారం, ఉండి పెద్దపేటలో విద్యుత్ వైరు తెగింది. యండగండి వద్ద భీమవరం-తాడేపల్లిగుడెం ప్రధాన రహదారిలో భారీవృక్షం రోడ్‌పై కూలింది. ఉండిలో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తణుకు రూరల్:కొమరవరం, యర్రాయి చెరువు, మహాలక్ష్మీ చెరువు గ్రామాల మార్గంలో ఈదురు గాలులకు చెట్లు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానిక నాయకులు, సిబ్బంది చెట్లను తొలగించారు. కొమరవరంలో ఎస్సీ ఏరియాలో విద్యుత్ స్థంభాలు కూలిపోయాయి.

ఇరగవరం: మండల వ్యాప్తంగా మంగళవారం మధ్యాహ్నం గాలులతో కూడిన వర్షం కురిసింది. ఇల్లిందలపర్రులో వరి చేలు నీట మునిగాయి. గోపాలపురంలో గాలులకు చెట్లు ఒరిగాయి.

పోడూరు:రావిగొప్పులో ఆరు విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. అధికారులు ముందస్తుగానే విద్యుత్‌ను నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. ఎలక్ట్రికల్ ఏఈ వివి.సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి మరమ్మతులు చేపట్టారు. కొమ్ముచిక్కాలలో వరిచేలో నుంచి వెళ్లిన 11కెవి విద్యుత్ లైన్‌పై కొబ్బరిచెట్టు పడటంతో విద్యుత్ తీగలు పూర్తిగా డ్యామేజ్ అయ్యాయి. దీంతో సుమారు 3గ్రామాలకు వెళ్లే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పెనుమంట్ర: నెగ్గిపూడి రామాలయం వద్ద కొబ్బరి చెట్టు విరిగిపడి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బ్రాహ్మణ చెరువు వద్ద చెట్టు పడటంతో విద్యు త్ లైన్‌లు తెగిపడి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. నత్తా రామేశ్వరం శివారు పాలి వెళ్లే రోడ్డులో ఊబ చెరువు వద్ద చెట్టు విరిగిపడటంతో విద్యుత్ లైన్‌లు తెగిపడ్డాయి. పొలమూరులో జమ్ము చెరువు గట్టున కొబ్బరి చెట్టు చింత చెట్టు విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. బ్రాహ్మణ చెరువు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిద్ర గన్నేరు చెట్టు ఇరిగేషన్ కార్యాలయంపై పడింది.

భీమవరం టౌన్: భీమవరంలో 10, 11,31 వార్డుల్లో ఈదురుగాలులకు చెట్లు పడిపోయాయి. దీంతో మునిసిపల్ అధికారులు హుటాహుటిన సిబ్బందిని పంపి చెట్లను తొలగించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందిలేకుండా చర్యలు చేపట్టారు. ఈదురు గాలులు బలంగా వీస్తాయనే వాతావరణ శాఖ సూచనల మేరకు పట్టణాల్లో సెంటర్ డివైడర్లలోను, భారీ ఫెక్సీలను తొలగింపు చర్యలు చేపట్టారు.

నేలకొరిగిన 107 విద్యుత్ స్తంభాలు

భీమవరం టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తీరం తాకుతున్న నేపథ్యంలో ముందు జాగ్రత చర్యలుగా జిల్లాలో విద్యుత్ సరఫరా నిలచి పోయింది. ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వచ్చినప్పటికీ అధికారులు పునరుద్ధరిస్తూనే ఉన్నారు. అయితే సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలచిపోయింది. ఈదురు గాలుల ప్రభావం తగ్గిన తరువాత పరిస్థితులను పరిశీలించి విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. తుఫాన్ కారణంగా జిల్లాలో 107 విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉషారాణి తెలిపారు. మంగళవారం రాత్రి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎక్కువగా నరసాపురం ప్రాంతంలో 73 స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. స్తంభాలు దెబ్బతిన్న ప్రాంతంలో కొత్తవాటిని ఏర్పాటుచేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టామన్నారు. 3.2 కిలోమీటర్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయని, తాడేపల్లిగూడెం ప్రాంతంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. బుధవారం నాటికి పూర్తిస్థాయి సమాచారం వస్తుందని అన్నారు. తమ సిబ్బంది 24 గంటలు విధి నిర్వహణలో ఉన్నారని తెలిపారు. కాల్ సెంటర్లకు వచ్చిన వాటిని తక్షణం స్పందించేలా చర్యలు చేపట్టామన్నారు.

కొవ్వొత్తులకు డిమాండ్

ఆకివీడు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ఎఫెక్ట్ వల్ల కొవ్వొత్తులకు డిమాండ్ పెరిగింది. తుఫాన్ గాలికి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో గృహాల్లో వున్న ఇన్వర్టర్లు కూడా చార్జింగ్ అయిపోయాయి. ఆకివీడు మండలంలోని గ్రామాలు, పట్టణం అంధకారంలో చేరుకున్నాయి. దీంతో ప్రజలు కొవ్వొత్తుల వైపు మరలడంతో హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. వ్యాపారస్తులు వాటి ధరను పెంచి అమ్మకాలు చేసినా.. దొరకని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ లేకపోవడంతో మంచినీళ్ల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలంతా మనోధైర్యంతో ఉండాలి

మొగల్తూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):తుఫాన్‌ను ఎదుర్కొంనేందుకు ప్రజలంతా మనోధైర్యంతో ఉండాలని మాజీ ఎమ్మెల్యేలు కొత్తపల్లి జానకిరామ్, జిల్లా వైసీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. తీర గ్రామాలైన పేరుపాలెం, కెపిపాలెం గ్రామాల్లో వారు వేర్వేరుగా పర్యటించారు. పేరుపాలెం పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు మాజీ ఎమ్మెల్యే జానకిరామ్ వడ్డన చేశారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు ప్రసాదరాజు కెపిపాలెం, పేరుపాలెం, పాతపాడు గ్రామాల్లో పర్యటించి ప్రజలంతా అప్రమత్తంగా ఉండా లని ప్రభుత్వం అందిస్తున్న సహాయక చర్యలపై ఆరా తీశారు.







ఆకివీడులో వరి దుబ్బు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు.. భీమవరం నియోజకవర్గంలో పునరావాస కేంద్రం వద్ద ఎమ్మెల్యే రామాంజనేయులు.. తణుకులో కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం

మొగల్తూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం విపత్తును ఎదుర్కొనేందుకు అన్ని సహాయక చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు తెలిపారు. పాతపాడు, పేరుపాలెంలోని మోళ్ళపర్రు, కెపిపాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఆచంట ఎమ్మెల్యే పీతాని సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, టీడీపీ ఇన్ చార్జ్ పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్యకార కార్పోరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి వారు పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ తీవ్రత ఎంతగా ఉన్నా ఎదుర్కొవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

ఆకివీడు రూరల్: తుఫాన్ వలన ఎదురయ్యే విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఆకివీడు మండలంలోని ఉప్పుటేరును ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పర్యవేక్షణలో ఉన్నారని తెలిపారు. ఇదిలా ఉండగా ఉప్పుటేరు సామర్థ్యం 15వేల క్యూసెక్కులు ఉండగా ప్రస్తుతం 9,500 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉందని డ్రెయినేజీ జేఈ ప్రసాద్ తెలిపారు.

ఆకివీడు/ఉండి: తుఫాన్ ప్రభావంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, కూటమి ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. చినకాపవరం మురుగుకాల్వ పొడవునా ఆక్రమణదారులు చెరువులు, ఇళ్ళు కట్టుకొని పారుదల లేకుండా చేస్తున్నారన్నారు. నవంబరు, డిసెంబరు నెలలో ఆక్రమణలు తొలగిస్తామన్నారు. పట్టణ పరిధిలో కొందరు బడా బాబులు అక్రమంగా ప్రభు త్వ స్థలాల్లో నిర్మాణాలు చేశారని, వాటిని కూడా తొలగిస్తామన్నారు. కాపవరం రోడ్‌లో వరి పొలాలను డిప్యూటీ స్పీకర్ పరిశీలించారు. ఉండి ఎంపీడీవో కార్యాలయంలో కూడా తుఫాన్‌పై స్థానిక అధికారులతో డిప్యూటీ స్పీకర్ సమీక్షించారు.

భీమవరం రూరల్: మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పర్యటించారు. మంగళవారం జోరువానలో సముద్ర తీర ప్రాంతాలైన కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాల్లో పర్యటించారు. లోతట్టు ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో 76 మందితో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు మోకా శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు.

ఆచంట:తుఫాన్ వల్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలి వెళ్ళాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ అవసరమైతే తప్ప ఏ ఒక్కరు బయటకు రావద్దని భారీ వృక్షాలు, శిథిలమైన భవనాలు క్రింద తలదాచుకోవద్దని కోరారు.

గణపవరం: గణపవరంలోని కేశవరం గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గణపవరం - పిప్పర ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇరువైపులా భారీ వృక్షాలను పోలీసులు, అధికారులు క్రేన్‌సాయంతో తొలగిస్తున్న పనులను ఎమ్మెల్యే ధర్మరాజు పరిశీలించారు. వరిపంట పాలుపోసుకునే దశలో ఉన్న వరిపంటను పరిశీలించారు.

తణుకు: తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం తణుకులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.

మంత్రి నారా లోకేశ్ ఆరా

ఉండి నియోజకవర్గ పరిస్థితి ఎలా ఉందని మంత్రి నారా లోకేశ్ మంగళవారం డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజుకు ఫోన్‌చేసి మాట్లాడారు. నియోజకవర్గం అంతా బాగానే ఉందని, ఎటువంటి సమస్య లేదని,అధికారులందరిని అలర్ట్ చేశానని రఘురామరాజు తెలిపారు.

రైతులు నష్టపోకుండా ఆదుకుంటాం

తాడేపల్లిగూడెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):తుఫాన్‌తో రైతులకు నష్టపోకుండా వారి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ముందస్తు చర్యలో భాగంగా కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల వద్ద నుంచి 138 టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



తాడేపల్లిగూడెం నుంచి తణుకు వెళ్తుండంగా ప్రత్తిపాడు బైపాస్ జంక్షన్ వద్ద తుఫాన్ కారణంగా పడిన కొబ్బరి చెట్టును

పెంటపాడు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రత్తిపాడు బైపాస్ జంక్షన్ సమీపంలో ఆర్టీసీ బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడేపల్లిగూడెం నుంచి తణుకు వెళ్తుండంగా ప్రత్తిపాడు బైపాస్ జంక్షన్ వద్ద తుఫాన్ కారణంగా పడిన కొబ్బరి చెట్టును గమనించకుండా డ్రైవర్ ఆ చెట్టు పైనుంచి బస్సును పోనిచ్చాడు. దీంతో బస్సు అదుపు తప్పి వేరే చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పెంటపాడు ఎస్ఐ స్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యం కావాలి



జ్యోతి వెలిగించి శిక్షణ ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని ఆ తరువాతే వ్యాపారాభివృద్ధి అని సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారి ఈ. లక్ష్మీకాంతం పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ పరిధిలోని కృషివిజ్ఞాన కేంద్రంలో సమగ్రపోషక యాజమాన్యం పై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 15 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవికే ప్రధాన శాస్త్రవేత్త పి.విజయ లక్ష్మీ మాట్లాడుతూ ఈ శిక్షణ ప్రధాన లక్ష్యం పంటల ఉత్పాదకతపెంపు, భూమి ఆరోగ్య సంరక్షణ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో సినియర్ సైంటిస్ట్ పెద్దబాబు, ఉద్యానకళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.రాఘవేంద్ర రెడ్డి శాస్త్రవేత్తలు ఎ.దేవి వరప్రసాద్‌రెడ్డి, అర్చన తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు నియోజకవర్గ సమాచారం

పునరావాస కేంద్రాల తనిఖీ



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

నిడదవోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన పునరా వాస కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో లోతట్టు ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, ఇందుకు సంబంధించి నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట కమిషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్ పువ్వల రతీదేవి, ఏఈ హేమంత్ ఉన్నారు.

భయాందోళనలో ప్రజానీకం

పెరవలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ప్రజలంతా భయాందోళన చెందుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బలమైన గాలులు వీయడంతో పాటు భారీ వర్షాలు కురుస్తుండంతో బిక్కుబిక్కుమంటున్నారు. 1996లో వీచిన గాలులను ఊహించుకుని ఆందోళ చెందుతున్నారు. టీవీలు, పత్రికలు, సామాజిక మాధమాల్లో విస్తృతంగా వార్తలు వస్తుండటంతో ఉన్నత స్థాయి నుంచి సామాన్య ప్రజానీకం ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ తగినజాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలావుండగా యంత్రాంగం మండలంలో తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకున్నది. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది.

పంటలు కాపాడుకోవాలి

నిడదవోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న సార్వ పంటకు శాస్త్రీయ పద్ధతులు పాటించి పంటలు కాపాడుకోవాలని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం సమిశ్ర గూడెం, రావిమెట్ల, కాంసాలిపాలెం, శింగవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

ధైర్యంగా ఉండండి.. మేమున్నాం : మంత్రి

నిడదవోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి : మొంథా తుఫాన్‌పై ప్రజలంతా ధైర్యంగా ఉండాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలులో ఆయన మాట్లాడుతూ ఎలాంటి విపత్కర పరిస్థితులులైనా ఎదుర్కొనేందుకు నిడదవోలులోని తమ క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తన కార్యాలయంలోని 9848166644, 9550365446, 8886519418 9440407096 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



తుఫాన్ పునరావాస కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి

ఉండ్రాజవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అన్ని సదుపాయాలు కల్పించాలని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఉండ్రాజవరం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ బీ. దుర్గామహేశ్వరరావుతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

వరి నేలమట్టం

ఉండ్రాజవరం, మండలంలో తుఫాన్ ప్రభావం వల్ల మంగళవారం సుమారు 213 హెక్టార్లలో వరి పంట నేలమట్టమైంది. చిలకపాడు, సత్యవాడ రోడ్డులో చెట్టు పడిపోవడంతో అధికారులు తొలగించారు. పాలంగిలో రోడ్డుపక్కన చెట్టు పడిపోవడంతో గ్రామ ప్రత్యేక అధికారి రామారావు, పంచాయతీ కార్యదర్శి హసన్‌జానీ ఆధ్వర్యంలో తొలగించారు.

అప్రమత్తంగా ఉండండి : అధికార్లకు కామినేని ఆదేశాలు

ముదినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా ప్రజలకు ఎటువంటి నష్టం కలుగకుండా అన్ని శాఖల అధికార్లు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మంగళవారం ముదినేపల్లి మండల అధికార్లను ఆదేశించారు. గ్రామాల్లో ముంపు సమస్య లేకుండా, ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హైదరాబాద్ నుంచి ఫోన్‌లో తహసీల్దార్, ఎంపీడీవోలకు తెలిపారు. మండలంలో తుపాను పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

31 నుంచి వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ఆగిరిపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలో శోభనగిరిపై వెలసిన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 31 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సీహెచ్ సాయి తెలిపారు. ఉత్సవాల్లో ముఖ్యంగా వచ్చే నెల 2న గిరి ప్రదక్షణ, 5న చక్రస్నానం జరుగుతుందని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పునరావాసాలకు తరలండి : ఆర్డీవో



సంచార జాతుల వారిని పునరావాసాలకు తరలాలని సూచిస్తున్న ఆర్డీవో అంబరీష్

కైకలూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎస్టీ కాలనీలోని ప్రజలను, ఏలూరు రోడ్డులోని సంచార జాతుల కుటుంబాల వారిని అధికారులు కైకలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లోని గోదాములో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఏలూరు రోడ్డులోని సంచారజాతుల ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి తుపాన్ వల్ల కలిగే ఇబ్బందులను వివరించి పునరావాసా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కైకలూరు తహసీల్దార్ వి.రామకృష్ణరావు, ఆర్ఐ బి. వెంకటేశ్వరరావు సంచారజాతుల ప్రజలను దగ్గరుండి పునరావాస కేంద్రానికి తరలించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఎంపీడీవో ఆర్. రాజబాబు, ఇతర అధికారులు ఎస్టీ కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించి దగ్గరుండి పునరావాస కేంద్రానికి తరలించారు. అలాగే ఆటపాకలో జాతీయ రహదారి వెంబడి వర్షపునీరు నిలబడడంతో ఎక్స్‌కవేటర్‌తో ఎంపీడీవో దగ్గరుండి నీటి పారుదలకు చర్యలు తీసుకున్నారు.

మండవల్లి: మండలంలో ఆరు తుపాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. 150 మందికి వసతి కల్పిస్తున్నట్టు అధికారులు తెలిపారు. భైరవపట్నంలో లోతట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న 25 కుటుంబాల వారిని జడ్పీ ఉన్నత పాఠశాలకు తరలించారు. మండలంలోని కొల్లేటి లంక గ్రామాల పరిస్థితిపై ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ ఆరా తీశారు.

చాట్రాయి: మండలంలోని పోలవరం దళితవాడ ప్రాథమిక పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఆ గ్రామంలో గుడిసెల్లో నివాసం ఉంటున్న 12 మంది పేదలను సోమవారం రాత్రి ఎస్సై రామకృష్ణ పునరావాస కేంద్రానికి తరలించి భోజన ఏర్పాట్లు చేశారు.

కలిదిండి: మండలంలో 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో ఫణీంద్ర తెలిపారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో ప్రజలను, వివిధ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఇంకా పలు గ్రామ సచివాలయాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

పునరావాస కేంద్రాల్లో ఆహారం వితరణ



ముదినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాన్ వల్ల లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముదినేపల్లి మండలంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వడాలి, ప్రొద్దువాక, ముదినేపల్లి, చేవూరు, పెరూరు, గురజ, అల్లూరు పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి సుమారు 300 మంది లోతట్టు ప్రాంతాల్లోని కాలనీ వాసులకు ఆశ్రయం కల్పించినట్లు తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. వడాలిలోని పునరావాస కేంద్రంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, పార్టీ నాయకులు భోజన సదుపాయం కల్పించగా, ప్రొద్దువాక పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణతో పాటు, వైసీపీ నాయకులు ఆహారం అందజేశారు.

సొంత ఖర్చుతో గుంత పూడ్పించిన టీడీపీ నేత



చాట్రాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తపూరు-బూరుగుగూడెం రహదారి(సీబీ రోడ్డు) పరిధిలో చాట్రాయి విజయ పాల కేంద్రం సమీపంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంత ప్రమాదకరంగా మారటంతో స్థానిక టీడీపీ నాయకుడు కుప్పిరెడ్డి కొండారెడ్డి రూ. 14 వేలు సొంత ఖర్చుతో మంగళవారం గుంతను పూడ్పించారు. ఇటీవల కూలీలతో వెళుతున్న ఆటో నుంచి మహిళ ఈ గుంతలో జారి గాయపడింది. ఇక్కడ ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పలువురు గాయపడ్డారు. గుంతను పూడ్పించాలని అనేకసార్లు ఆర్అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవటంతో సొంత ఖర్చుతో పూడ్పించినట్లు కొండారెడ్డి చెప్పారు.

చెరువుకట్ట బలోపేతం



నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎక్స్‌కవేటర్ సాయంతో చెరువుకట్టలు పటిష్టానికి గ్రామ రైతులు చర్యలు చేపట్టారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడు గ్రామానికి చెందిన పర్వతనేని సాయికృష్ణ ఆధ్వర్యంలో దేవన్నచెరువు కట్టను పటిష్ఠం చేశారు.

తమ్మిలేరు దాటకుండా చర్యలు



చాట్రాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండలంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఎస్సై డి. రామకృష్ణ, ఇతర అధికారుల ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మైక్ ద్వారా తుఫాన్ హెచ్చరికలు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు గ్రామాల మధ్య తమ్మిలేరు దాటకుండా పోలీసు, రెవెన్యూ శాఖల సిబ్బందితో పహరా ఏర్పాటు చేశారు. ప్రమాదకర వాగులకు వెళ్ళే రోడ్లకు అడ్డంగా ట్రాక్టర్లు పెట్టి బ్లాక్ చేశారు. ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ఏదైనా అత్యవసరమైతే 112కి డయల్ చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

రహదారిని అభివృద్ధి చేయాలని ఆందోళన



ముసునూరు, అక్టోబ రు 28 (ఆంధ్రజ్యోతి): నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారిని కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు జి.రాజు డిమాండ్ చేశారు. మంగళవారం సింహాద్రిపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతల వద్ద స్థానికులతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి నిధులు కేటాయించి, కొంతమేర మార్జిన్లో కంకర వేసి సుమారు రూ. కోటి బిల్లులు చేసుకుని, పనులు నిలిపివేసి సుమారు నాలుగేళ్ళు కావస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఈ రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టకపోవడం దారుణమని, ఇప్పటికైనా రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	270
చికెన్ స్కిన్‌లెస్	280

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



ముదినేపల్లి మండలం కోడూరులో వర్షాలతో జలమయమైన సార్వా వరి పొలాలు..



ఉధృతంగా పెదలంక మేజర్ డ్రెయిన్



చాట్రాయిలో ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు



పెదపుట్లపూడిలో నిండిన చేపల చెరువులను పరిశీలిస్తున్న ఆక్వా రైతులు

వరిపై మొంథా పంజా

» వరికి తీవ్ర నష్టం » ఆక్వా రైతుల్లోను ఆందోళన » చాట్రాయిలో ధాన్యం రక్షణ చర్యలు

ముదినేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ వరిపై పంజా విసిరింది. మంగళవారం ఈదురు గాలులతో వర్షం కురవటంతో ముదినేపల్లి మండలంలోని వేలాది ఎకరాల ఆయకట్టులోని సార్వా వరి పైరు నేలకొరిగింది. కొన్ని గ్రామాల్లో వరి నీట మునిగింది. మండలంలోని ముదినేపల్లి, దేవపూడి, వణుదుర్రు, ఉప్పరగూడెం, చిగురుకోట, పెద కామన పూడి గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి పైరు నేల మట్టం కాగా, కోడూరు గ్రామంలో పొలాలు ముంపునకు గురయ్యాయి. మైనర్ డ్రెయిన్లు పూడుకు పోవటంతో పొలాల నుంచి వర్షపు నీరు త్వరితగతిన తగ్గే అవకాశం కనిపించటం లేదు. భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన ఎక్కువయింది.

పొంగిన డ్రెయిన్లు: వర్షాలకు ముదినేపల్లిలోని డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పొలాల్లో ముంపు నీరు త్వరితగతిన తగ్గే అవకాశాలు కనిపించటం లేదు. కొల్లేరు, ఉప్పుటేరుల్లో నీటి మట్టం పెరగటంతో పోల్‌రాజ్, పెదకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్లలో నీటి ప్రవాహం స్తంభించిపోయింది. కొమరవోలు డ్రెయిన్ నుంచి పెద్ద ఎత్తున నీరు రావటంతో పోల్‌రాజ్ డ్రెయిన్ పొంగింది. దీంతో వేలాది ఎకరాల్లో ముంపు పెరిగి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది.

చాట్రాయిలో ధాన్యం రక్షణ చర్యలు

చాట్రాయి: తుఫాన్ రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నది. సోమవారం రాత్రి నుంచి చిరుజల్లులు పడుతుండటంతో అన్నదాతలు కలవర పడుతున్నారు. మండలంలో 12 వేల ఎకరాలలో వరిసాగు జరగ్గా ఎక్కువ శాతం పంట కోతదశలో ఉంది. ఈ పరిస్థితులలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిస్తే పంట మొత్తం నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి, బూరుగుగూడెం తదితర గ్రామాల్లో రైతులు ఖర్చుకు వెనకాడకుండా మిషన్లతో వరికోతలు కోసి వెంటనే పచ్చి ధాన్యం అమ్ముకుంటున్నారు. 75 కేజీల పచ్చి ధాన్యం బస్తా రూ. 1450కి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మండలంలో చెరువులన్నీ ఇప్పటికే నిండుకుండల్లా ఉండగా, ఇప్పుడు మళ్లీ భారీ వర్షాలు కురిస్తే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆక్వా రైతుల బెంబేలు

కలిదిండి: భారీ వర్షాలకు చేపల చెరువులు నిండుకుండలా ఉండటంతో గండ్లు పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. రేయింబవళ్లు చెరువుల వద్ద కాపలా ఉంటూ చెరువుల్లో నీటిని మోటార్‌లతో బయటకు తోడుకుంటున్నారు. చెరువులు నిండినప్పటికీ చేపలు, రొయ్యలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోకుండా వలలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. పంట చేతికి వస్తుందో లేదోనని భయాందోళన చెందుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి



అడవినెక్కలం గ్రామంలో ఊర చెరువును పరిశీలిస్తున్న మంత్రి

ఆగిరిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆగిరిపల్లి మండలం అడవినెక్కలంలో గండి పడే అవకాశం ఉన్న ఊర చెరువును పరిశీలించారు. తీసుకోవల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. అడవి నెక్కలం జడ్పీ హైస్కూలులో ఇటీవల కూలిన ప్రహరీ గోడను మంత్రి పరిశీలించి లక్ష రూపాయలను మంజూరు చేశారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో బి బార్గవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●ఆగిరిపల్లి జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఆగిరిపల్లిలోని 27 కుటుంబాలను, సగ్గూరులో సుమారు 15 కుటుంబాలు వరకు పునరావాస కేంద్రాల్లో ఉంచామని వారికి ఇబ్బంది లేకుండా భోజనం వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాతావరణం అనుకూలించే వరకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

నూజివీడు టౌన్: నూజివీడు మండలం రామన్నగూడెం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను అధికారులతో కలిసి మంత్రి పార్థసారథి పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నూజివీడు నియోజకవర్గంలో పంటల స్థితిగతులను వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూజివీడు మండల వ్యవసాయ అధికారి చెన్నారావు, తహసీల్దార్ భద్రు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు: తుఫాన్ల వల్ల అత్యంత ప్రమాదకరంగా ఉండే తీరప్రాంత గ్రామాలను నేరుగా అప్రమత్తం చేసే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ఈ కారణంగా తుఫాను ప్రమాద తీవ్రతను ప్రజలు నేరుగా తెలుసుకుంటారని మంత్రి తెలిపారు. మంగళవారం రాత్రి నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

కంట్రోల్ రూంకు ఫోన్ చేయండి

ముసునూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి ఈదురుగాలులతో వర్షం కురుస్తోంది. తమ్మిలేరు పరివాహక గ్రామాల్లో పరిస్థితిని ఎంపీడీవో పిల్లి ఏసుబాబు పరిశీలించారు. చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్ నంబర్లు 86882 29896, 94929 38116కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నష్ట నివారణ చర్యలు చేపట్టండి

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో భారీవర్షాలు కురుస్తున్నందున వర్షాల అనంతరం పంటనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి చెన్నారావు తెలిపారు. వరి పంట నేలవాలితే నిలబెట్టి కట్టలు కట్టుకుని ప్రొపైకొనాజోల్ 200 ఎం.ఎల్ ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలన్నారు. ప్రస్తుతం మినుము పంట కోతకు సిద్ధంగా ఉందని, వర్షపునీటిని కాలువల ద్వారా బయటకు పంపాలని, మినుము మొలకెత్తే అవకాశం ఉన్నందున ఐదుశాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయటం ద్వారా మొలకశాతాన్ని తగ్గించుకోవచ్చన్నారు. పత్తిపంట సైతం మొదటి, రెండవ తీత దశలో ఉన్నందున పొలంలో నిలిచిన నీటిని బయటకు పంపి ఎకరానికి 30కిలోల యూరియా, పదినుంచి 15కిలోల పొటాష్ ఎరువులను అదనంగా పంటకు అందించాలన్నారు.

పత్తి రైతులు జాగ్రత్తలు పాటించాలి

చాట్రాయి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏవో శివశంకర్ సూచించారు. మండలంలోని నరసింహారావుపాలెం, చనుబండ, పర్వతాపురం గ్రామాల్లో మంగళవారం రైతులతో కలిసి ఆయన పత్తి చేలను పరిశీలించి మాట్లాడుతూ పత్తి చేల్లో కాలువలు తీసి వర్షం నీటిని బయటకు పంపాలన్నారు. తెగుళ్ళ నివారణ, ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు.

పెద్దయెత్తున తుఫాన్ సహాయక చర్యలు



ఉప్పుటేరు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీ, డిప్యూటీ స్పీకర్

కైకలూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సహాయక చర్యలను ప్రభుత్వం పెద్దఎత్తున చేపట్టిందని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి సురక్షితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణ రాజు అన్నారు. మంగళవారం కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరు వద్ద కొల్లేరు వరద ఉధృతిని డిప్యూటీ స్పీకర్‌తో కలిసి ఎంపీ పరిశీలించారు. అధికారులు పునరావాస కేంద్రాల వద్ద ఏ విధమైన ఏర్పాట్లు చేసిందీ తెలుసుకోవడంతో పాటు కొల్లేరుకు వచ్చే వరదనీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి వెళుతుందని ఎక్కడైనా నీటి ప్రవాహానికి అవరోధం కలిగితే తొలగింపు పనులు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఆహారం, వైద్యసేవలు అందుబాటులో ఉంచారన్నారు. అనంతరం కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆహార పొట్లాలను అంద జేశారు. కైకలూరు ఎంపీడీవో ఆర్. రాజబాబు, మండల ప్రత్యేక అధికారి జితేంద్ర, ఎంపీపీ అడవి కృష్ణ, టీడీపీ నాయకులు బీకేఎం నాని, కరేటి శ్రీహరి పాల్గొన్నారు.

ఎంపీ పుట్టా మహేష్ .. డిప్యూటీ స్పీకర్ రఘురామతో కలసి వరద ఉధృతి పరిశీలన

ముదినేపల్లి: అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రాత్రి పెనుమల్లిలో తుఫాన్ సహాయక చర్యలపై ఏలూరు జడ్పీ సీఈవో శ్రీహరి, ఎంపీడీవో రామకృష్ణతో సమీక్షించారు. మండలంలో వరి, ఆక్వా రైతులకు సంబంధిత అధికార్లు సూచనలివ్వాలని తెలిపారు. ఎన్‌డిఎ నాయకులు కూడా తుఫానును ఎదుర్కొవడంలో ప్రజలకు రక్షణగా నిలవాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.



కోరుకొల్లులో రేకుల షెడ్డుపై కూలిన చెట్టు



తామరకొల్లులో రహదారిపై కూలిన వృక్షాన్ని తొలగిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు



ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు వద్ద దుకాణంపై కూలిన చెట్టు



చిత్తపూరులో దెబ్బతిన్న ఇంటికి పరిహారం ఇవ్వాలని లిబరేషన్ నాయకుల ఆందోళన

తుఫాన్ ప్రభావంతో పలు చోట్ల కూలిన చెట్లు..

కైకలూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో పలుచోట్ల చెట్లు కూలాయి. తామరకొల్లు గ్రామంలో భారీ వర్షానికి చెట్టు కూలిపోవడంతో అగ్నిమాపకశాఖ అధికారులు తొలగించారు. అలాగే వేమవరప్పాడులో భారీవృక్షం కూలిపోవడంతో అధికారులు యంత్రాల సహాయంతో ముక్కలుగా కోయించి తరలించారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంలు ఏర్పాటుచేశారు. భారీ హోర్డింగ్‌లను తరలించారు. కైకలూరు పట్టణంలో దుకాణాలన్నీ ముందుగానే మూసివేశారు. 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముదినేపల్లి: ముదినేపల్లి - భీమవరం ప్రధాన రహదారిలో అల్లూరు రాజానగరం, సింగరాయపాలెం గ్రామాల వద్ద పెద్ద వృక్షాలు కూలిపోగా తహసీల్దార్ లతీఫ్ పాషా, ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు కూలిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. విశ్వనాద్రిపాలెం వద్ద రోడ్డుపై చెట్టు కూలి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా పెదగొన్నూరు సర్పంచ్ తాడంకి శిరీష ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో చెట్టును తొలగించారు. ఉప్పరగూడెంలో నివాస గృహాల మధ్య రోడ్డుపై చెట్టు కూలిపోగా గ్రామస్థులు తొలగించారు. బొమ్మినంపాడులో ఒక షాపుపై చెట్టు కూలగా సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లింది.

చెట్టుపడి కూలిన ట్రాన్స్‌ఫార్మర్..

ఈదురు గాలులకు మంగళవారం రాత్రి ముదినేపల్లి మండలం వాడవల్లిలో చెట్టుపడి ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. చెట్టు విద్యుత్ స్తంభంపై పడడంతో ట్రాన్స్‌ఫార్మర్ కూలి వాడవల్లిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇదిలా ఉండగా చెట్లు కూలిన ముదినేపల్లి - భీమవరం రహదారిలో వాహనాల రాకపోకలను నిలిపివేశామని తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు.

కలిదిండి: తుఫాన్ ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం కురుస్తుండటంతో పలు గ్రామాల్లో వృక్షాలు కూలిపోయాయి. భీమవరం - గుడివాడ రహదారిపై పలు వృక్షాల కొమ్మలు విరిగి పడటంతో అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు.

చాట్రాయి: తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలులకు చిత్తపూరులో పడమట దళితవాడలో చెట్టు కూలి తిరువీధి వెంకటేశు రేకుల షెడ్డుపై పడి ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఇంట్లోని వారు భయంతో బయటకు పరుగుతీశారు. ప్రభుత్వం తనకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడు కోరారు. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు కలపాల వెంకటేశ్వరరావు, చాట్ల బాబూరావు, ఆడుమిల్లి వెంకటేశ్వరరావు తదితరులు బాధితుడికి పరిహారం ఇవ్వాలని దెబ్బతిన్న ఇంటి వద్ద ఆందోళన చేశారు.







1.నూజివీడు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి

2. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని పునరావాస కేంద్రంలో ప్రజలకు ఆహార పొట్లాలు అందజేస్తున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్

3.యర్రావారిగూడెం వద్ద ప్రజలు వెళ్లకుండా రహదారిని బ్లాక్ చేసిన పోలీసులు

క్రైమ్ కార్నర్

మహిళ ఆత్మహత్య



పేరం జయమ్మ (ఫైల్)

ముసునూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం లోపూడి గ్రామానికి చెందిన పేరం జయమ్మ(47) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఈ నెల 27వ తేదీ ఉదయం పశువులను మేతకు తోలుకుని వెళ్ళగా విపరీతమైన కడుపు నొప్పి రావడంతో పొలం వద్ద పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను పశువుల కాపరులు ఇంటికి తీసుకువెళ్ళగా, ఆమె కుమారుడు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. చికిత్స పొందుతున్న మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు ఉన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఆగిరిపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామానికి చెందిన రాయల నవదీప్ (12) అనే బాలుడు తప్పిపోయి, ఆగిరిపల్లి మండలం శోభనాపురం గ్రామంలో మంగళవారం తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. బాలుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి సదరు బాలుడి ఫొటో చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్‌కు పంపగా, బాలుడి తండ్రి తెలుసుకొని ఆగిరిపల్లి పీఎస్‌కు రావడంతో ఆయనకు అప్పగించామని ఎస్ఐ కె. శుభశేఖర్ తెలిపారు.

ఎక్సైజ్ దాడులు.. మద్యం స్వాధీనం

నూజివీడు టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అనధికార మద్యం దుకాణాలను నడుపుతున్న వారిపై నూజివీడు ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో రావిచర్ల గ్రామంలో డి.శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే మెతుకుమల్లి వెంకటేశ్వరరావును అదుపులోకి తీసుకుని అతని నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రావిచర్లకు చెందిన మరీదు మల్లికార్జునరావు, యార్లగడ్డ కృష్ణ, బుడిగల శ్రీనివాసరావును అదుపు లోకి తీసుకుని వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారికంగా బెల్టుషాపు ద్వారా మద్యం విక్రయించినా లేక ఎక్కడైనా కల్తీ మద్యం గమనించినా 94409 02462 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.